ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
శుక్రవారం 29 ఆగస్టు 2025 | 5





విద్యుత్‌కాంతుల వెలుగుల్లో అమలాపురం షరాబుల పందిరి

జయ.. జయ.. జయ.. జయ.. వినాయక

» జిల్లాలో ఘనంగా గణపతి నవరాత్రులు ప్రారంభం



ఆలమూరు లక్ష్మిగణపతి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన 13 అడుగుల బాహుబలి మట్టి గణపయ్య



మండపేట తోపుడు బండ్ల సంఘం ఆధ్వర్యంలో కేపీ రోడ్డులో ఏర్పాటు చేసిన 9అడుగుల గ్రీన్ వినాయకుడు



అంబాజీపేట మండలం గంగలకుర్రు మలుపు వద్ద యువగణపతి ఆలయాన్ని అరటిగెలలతో అలంకరించిన భక్తులు



అయినవిల్లి సిద్ధివినాయకుని దర్శించుకున్న కలెక్టర్ మహేష్ దంపతులు



అయినవిల్లిలో శ్రీసిద్ధివినాయకుని అలంకరణ



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా పౌరసరఫరా అధికారి ఉదయభాస్కర్

స్మార్ట్‌కార్డుల పంపిణీకి సిద్ధం కావాలి

» జిల్లా పౌరసరఫరాల అధికారి ఉదయభాస్కర్

ముమ్మిడివరం,ఆగస్టు28(ఆంధ్రజ్యోతి): స్మార్ట్‌కార్డుల పంపిణీకి సిద్ధంకావాలని జిల్లా పౌరసరఫరాల అధికారి ఉదయభాస్కర్ ఆదేశించారు. ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజనీరింగ్ కాలేజీలో పౌరసరఫరాల కార్యాలయంలో రేషన్‌డీల్లర్లు, ఉపతహశీల్దార్లకు స్మార్ట్‌కార్డుల పంపిణీకి సంబంధించి నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రప్రభుత్వం క్యూర్ కోడ్ ఆధారిత స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీకి రంగం సిద్ధం చేసిందని, వాటిని సెప్టెంబరు 6 నుంచి పంపిణీకి సిద్ధం కావాలని అన్నారు. ప్రభుత్వం పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ డేటా ఈ బేస్‌లో ఉన్న అర్హులైన కుటుంబాల వివరాలతో ఈ స్మార్ట్‌కార్డు రూపొందించిందన్నారు. ప్రతి కుటుంబానికి యూనిక్ క్యూర్ కోడ్ కలిగిన స్మార్ట్‌కార్డును ముద్రించారన్నారు. ఈ కార్డులో కుటుంబసభ్యుల ఆధార్, రేషన్ వివరాలు ఉంటాయన్నారు. నకిలీకార్డులు తొలగిస్తామన్నారు. గ్రామ, వార్డు స్థాయి అధికారుల ద్వారా అర్హులైన కుటుంబాలకు కార్డులకు పంపిణీ చేయాలన్నారు. కార్డు అందించేటప్పుడు లబ్ధిదారుడి ఆధార్ లేదా బయోమెట్రిక్ ద్వారా ధ్రువీకరిస్తారన్నారు. రేషన్‌షాపుల్లో స్మార్ట్‌కార్డు చూపి స్కాన్ చేయాలన్నారు. క్యూఆర్ కోడ్‌ద్వారా సెంటర్ సర్వర్‌నుంచి కుటుంబ వివరాలు, లభ్యమయ్యే రేషన్ వివరాలు వస్తాయన్నారు. రేషన్ సరుకులు జారీ తర్వాత వివరాలు ఆటోమెటిక్‌గా నమోదవుతాయన్నారు. ప్రజాపంపిణీ వ్యవస్థలో అక్రమాలకుతావులేకుండా పారదర్శకతతో పగడ్బందీగా స్మార్ట్ రేషన్‌కార్డులు రూపొందించారన్నారు. కార్డు దారులు బయోమెట్రిక్, ఓటీపీ ద్వారా కార్డులు పొందవచ్చునన్నారు. స్మార్ట్ ఈపోస్ మిషన్లు కూడా అందుబాటులోనికి రానున్నాయని, గతంలోలా సర్వర్ సమస్యలు ఉండవని తెలిపారు. రేషన్‌డీల్లర్లు, ఉపతహశీల్దార్లు పాల్గొన్నారు.

మళ్లీ వరద భయం!



» జిల్లాలో భారీవర్షం
» అత్యధికంగా మలికిపురంలో 90.6 మిల్లీమీటర్ల వర్షపాతం
» మునిగిన లోతట్టు ప్రాంతాలు, వరి పొలాలు

అమలాపురం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడన ప్రభావంతో జిల్లావ్యాప్తంగా బుధవారం నుంచి గురువారం వరకు భారీవర్షం కురిసింది. దీంతో కోనసీమ జిల్లా పరిధిలోని లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. దీనికితోడు తాజాగా గోదావరికి వరద మరోసారి ముంచెత్తే అవకాశం ఉందని సమాచారం అందింది. భారీ వర్షాల కారణంగా జిల్లాలో బుధవారం భారీగా వర్షం కురవడంతో అమలాపురం, మండపేట, రామచంద్రపురం మున్సిపాలిటీలతోపాటు అన్నిప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. డ్రైన్లు పొంగి ప్రవహించడంతో సమీపంలోని పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మురుగునీరు దిగేందుకు అవరోధాలు అధికంగా ఉండడంతో నీరు దిగకపోవడంవల్ల ముంపు తీవ్రత ఎక్కువైందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

నేడు భారీ వర్షం కురిసే అవకాశం

శుక్రవారం కూడా జిల్లావ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని వాతావరణశాఖ ఆదేశాలు ఇచ్చింది. జిల్లాలో అత్యధికంగా మలికిపురంలో 90.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా అత్యల్పంగా 9.2 మిల్లీమీటర్ల వర్షపాతం అయినవిల్లిలో రికార్డయింది. గోదావరి పరివాహక రాష్ట్రాలైన మహారాష్ట్ర, తెలంగాణా, ఆంధ్రాలో కురిసిన భారీ వర్షాలతో ప్రాజెక్టులన్నీ జలకళ సంతరించుకోవడంతోపాటు భారీగా వరద నీరు గోదావరిలోకి వదిలేయడంతో భద్రాచలంవద్ద వరద గురువారం నుంచి పెరుగుతుంది. పోలవరం బ్యారేజీ వద్ద 6.50లక్షల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి వదలడంతో కోనసీమలోని గౌతమీ, వశిష్ఠ, వైనతేయ, వృద్ధగౌతమీ నదీపాయల్లో మళ్లీ వరదనీరు పోటెత్తుతోంది. ఈసారి వరద తీవ్రత ఎక్కువగానే ఉండవచ్చునని ఇరిగేషన్ అధికారులు అంచనాలు వేస్తూ నదీ పరివాహక తీర గ్రామాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

వర్షపాతం ఇలా..

జిల్లాలో బుధవారం నుంచి గురువారం ఉదయం వరకు కురిసిన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. అత్యధికంగా మలికిపురంలో 90.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా అత్యల్పంగా అయినవిల్లిలో 9.2 నమోదైంది. ఆత్రేయపురంలో 50.8, మండపేట 11.6, రాయవరం 10, రామచంద్రపురం 14.2, ఆలమూరు 32, రావులపాలెం 43.4, కొత్తపేట 36.2, కె.గంగవరం 35.2, ఐ.పోలవరం 28.2, ముమ్మిడివరం 20.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పి.గన్నవరంలో 22.8, అంబాజీపేటలో 26.4, మామిడికుదురులో 13, రాజోలులో 29.4, సఖినేటిపల్లిలో 78.2, అల్లవరంలో 9.6, అమలాపురంలో 19.2, ఉప్పలగుప్తంలో 18.8, కాట్రేనికోనలో 12.2మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా జిల్లావ్యాప్తంగా 29.6 సగటు వర్షపాతం నమోదైంది.

మరో పోరు!



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మల్లాడి, ఎమ్మెల్యేలు ఆనందరావు, వనమాడి

» 'రిలయన్స్‌పై పోరాటానికి సిద్ధమవుతున్న మత్స్యకారులు
» ఇటీవల పైపులైను పేలుడుతో మత్స్య సంపదకు నష్టం
» పరిహారమివ్వాలని మల్లాడి ఎమ్మెల్యేలు ఆనందరావు, వనమాడి వినతి

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

బంగాళాఖాతం సముద్రతీరంలో చమురు, సహజ వాయువులు అన్వేషణ చేస్తున్న రిలయన్స్ ఇండస్ట్రీస్ సంస్థపై ఆందోళనకు ప్రజా ప్రతినిధులు సంసిద్ధమవుతున్నారు. మత్స్యకారులు వేటాడే మత్స్య సంపదకు ఈ అన్వేషణ వల్ల నష్టం వాటిల్లుతున్న దృష్ట్యా మత్స్యకార వర్గాలను ఆదుకోవాలనే డిమాండ్‌పై ఆ సామాజికవర్గాలకు చెందిన ప్రజాప్రతినిధులతో పాటు టీడీపీకి చెందిన ఎమ్మెల్యేలు అధికారులను కలిసి విజ్ఞప్తులు చేస్తున్నారు. పాండిచ్చేరి రాష్ట్ర పరిధిలో ఉన్న యానాంకు సమీపంలోని సముద్రతీరంలో ఈనెల 22న అర్ధరాత్రి వేళ రిలయన్స్ సంస్థకు చెందిన గ్యాస్ పైపులైను లీకై భారీగా విస్ఫోటనంతో మంటలు ఉవ్వెత్తున ఎగసిపడ్డాయి. యానాంతోపాటు ఏపీకి చెందిన వివిధ ప్రాంతాల ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఈ పైపులైను పేలుడు, చమురు లీకేజీ అయి మంటలు వ్యాపించడంతో యానానికి సమీపంలో సముద్రంలోఉన్న మడ అడవులు దగ్ధమయ్యాయి. దీంతోపాటు ఆయిల్ వంటి చమురు తెట్టు గోదావరిపాయలో కలవడంతో మత్స్య సంపదకు తీవ్ర నష్టం వాటిల్లిందంటూ గాడిమొగ, భైరవపాలే గ్రామాలకు చెందిన ప్రజలతోపాటు ప్రజాప్రతినిధులు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో డిసెంబరులో రిలయన్స్ సంస్థ సముద్రం, గోదావరిలోనుంచి పైపులైను వేసే సమయంలో మత్స్యకార కుటుంబాలకు నష్టంవాటిల్లనున్న దృష్ట్యా మత్స్యకారులతోపాటు సామాజికవర్గాలవారికి నష్టపరిహారం అందించేలా ఒత్తిడి పెంచేలా ప్రజా ప్రతినిధులు ముందడుగు వేస్తున్నారు.

మత్స్యకారులకు పరిహారాలు ఇవ్వాలి

దీనిలోభాగంగా ఎమ్మెల్యేలు అటు కాకినాడ, ఇటు కోనసీమ జిల్లాలకు చెందిన కలెక్టర్లను కలిసి ఈనెల 22న సముద్రం, గోదావరి ప్రాంతంలో పైపులైను లీకేజీ కారణంగా జరిగిన నష్టాలను వివరిస్తూ వినతిపత్రాలు అందజేస్తున్నారు. పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అమలాపురంలోని కలెక్టర్‌ను గురువారం కలిశారు. మూడు పేజీలతో కూడిన వినతిపత్రాన్ని ఆయనకు అందజేశారు. ఇప్పటికే పైపులైను పేలుడుతో చమురు లీకై గాడిమొగ, భైరవపాలెం పరిసర ప్రాంతాల్లో చమురు తేలడంవల్ల మత్స్యసంపదకు తీవ్ర నష్టం కలిగిన దృష్ట్యా రిలయన్స్ సంస్థతో మాట్లాడి మత్స్యకారులకు న్యాయం చేయాలని కోరారు. కొన్నిరోజుల క్రితం మల్లాడి, వనమాడి కాకినాడ కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇప్పటికే ఇదే అంశంపై ముమ్మిడివరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ దాట్ల బుచ్చిరాజు సైతం మత్స్యకారులకు న్యాయం చేయాలని కోరారు. ప్రధానంగా నవంబరు, డిసెంబరుల్లో ఓఎన్జీసీ, రిలయన్స్ రెండో పైపులైనును వేసే అవకాశం ఉందని, అప్పుడు కూడా అందరికీ పరిహారాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయాన్ని ఇప్పటికే ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, అప్పటి బీజేపీ చీఫ్, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుపాటి పురందేశ్వరిలకు వినతిపత్రాలు కూడా ఇచ్చి సమస్యను వారి దృష్టిలో పెట్టినట్టు మాజీ మంత్రి మల్లాడి తెలిపారు. దీంతో మత్స్యకారులకు నష్టపరిహారంకోసం రిలయన్స్ సంస్థపై ప్రజాప్రతినిధుల వ్యూహాత్మక ప్రణాళికలతో అటు మత్స్యకారులు, ఇటు తీర గ్రామాల ప్రజలు మరోసారి పోరాటానికి సిద్ధమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

బీసీ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా అనంతకుమారి బాధ్యతల స్వీకరణ

కొత్తపేట, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): విజయవాడ తాడిగడపలోని బీసీ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ కార్యాలయంలో రెడ్డి అనంతకుమారి గురువారం చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు బీసీ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సత్యనారాయణ అనంతకుమారితో ప్రమాణస్వీకారం చేయించారు. చైర్‌పర్సన్‌గా ప్రమాణస్వీకారం చేసిన అనంతకుమారిని రాష్ట్ర కార్మిక శాఖామంత్రి వాసంశెట్టి సుభాష్, పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం, ఎమ్మెల్యేలు బండారు సత్యానందరావు, పితాని సత్యనారాయణ, పలు విభాగాల చైర్మన్లు హాజరై ఆమెను సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీసీ వర్గాల అభివృద్ధి సంక్షేమానికి కృషి చేస్తానని, వారికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని అన్నారు.



విజయవాడలో బాధ్యతలు స్వీకరిస్తున్న రెడ్డి అనంతకుమారి

ప్రభుత్వ పథకాల అమలుపై
సంతృప్తి స్థాయిలు పెరగాలి

» కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్సులో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్

అమలాపురం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ అభివృద్ధి పథకాలపై ప్రజల సంతృప్తి స్థాయిలను మెరుగు పరచాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ, ప్రభుత్వ సేవలపై ఈ స్థాయిలు పెరగాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ అమరావతి నుంచి వివిధ జిల్లాల కలెక్టర్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నీటి సంరక్షణ, మైనర్ ఇరిగేషన్, చెరువుల పూడికతీత, ఆధునికీకరణ పనులు, పీఎం కుసుమ స్కీమ్‌లో సంతృప్తి స్థాయిల పురోగతి, డాక్యుమెంట్ల అప్‌లోడ్, యూరియా అందుబాటులో ఎంత మేర ఉంది? ధరల నియంత్రణ వంటి అంశాలపై ప్రధాన కార్యదర్శి కలెక్టర్ మహేష్‌కుమార్‌తో మాట్లాడారు. జిల్లాస్థాయిలో జువైనల్ జస్టిస్ కమిటీలు ఏర్పాటు అంశాల పురోగతిపై సమీక్షించారు. కలెక్టర్ మహేష్‌కుమార్ మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో సౌరశక్తిని ప్రోత్సహించడం, తద్వారా రైతులు విద్యుత్ అవసరాలను వారే తీర్చుకునేలా కల్పించడం వంటి చర్యలు తీసుకోవాలి అధికారులను ఆదేశించారు. డీజిల్ వాడకం తగ్గడంవల్ల పర్యావరణకాలుష్యంతగ్గుతోందని, పంపుసెట్ల కొనుగోలుకు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తోందని కలెక్టర్ తెలిపారు. కాన్ఫరెన్స్‌లో జేసీ నిషాంతి, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు



డీఎస్సీ-25 మెరిట్ అభ్యర్థుల సర్టిఫికెట్లను తనిఖీ చేస్తున్న అధికారులు

అర్ధరాత్రి వరకూ తర్జనభర్జన

7

» చేబ్రోలులో డీఎస్సీ అభ్యర్థులు సర్టిఫికెట్ల వెరిఫికేషన్
» సాంకేతిక సమస్యలతో ఆలస్యం.. నేడూ పరిశీలన

కిక్కిరిసిన అయినవిల్లి



స్వామిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు, ప్రత్యేక పుష్పాలంకరణ



అయినవిల్లి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): అయినవిల్లి శ్రీసిద్ధివినాయక ఆలయంలో వినాయకచవితి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. తొలిపూజలు అందుకునే దైవం, విఘ్నాలు తొలగించే స్వామి, బుద్ధి-సిద్ధులను ప్రసాదించే, ప్రమద గణాధిపతి పర్వదినమైన శ్రీవినాయక చవితి సందర్భంగా అయినవిల్లి శ్రీసిద్ధివినాయక ఆలయానికి భక్తులు పోటెత్తారు. చవితి ఉత్సవాలను పురస్కరించుకుని వివిధ రకాల పుష్పాలతో ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. బుధవారం ఉదయం 3.45 నుంచి స్వామివారికి అభిషేకాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శైవాగమ మోక్త ప్రకారంగా ప్రధానార్చకులు బ్రహ్మశ్రీ మాచరి వినాయకరావు ఆధ్వర్యంలో స్వామివారికి వివిధ రకాల పండ్ల రసాలతో శ్రీరుద్రాభిషేకం, లక్ష దుర్వార్చన, గణపతి కల్పము, శ్రీలక్ష్మీ గణపతి హోమాలు నిర్వహించారు. మధ్యాన్ని 3 గంటలకు వినాయక వ్రతకథ చదివి కథాక్షితలను భక్తులకు బహూకరించారు. స్వామివారికి ప్రత్యేకాలంకరణలు చేసి పంచ హారతులిచ్చారు. సాయంత్రం స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు. అయినవిల్లి సిద్ధివినాయకున్ని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఆలయ ఈవో అల్లు దుర్గాభవానీ స్వామివారి చిత్రపటాన్ని అందించారు. పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, జేసీ టి.నిషాంతి, కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్, అమరావతి హైకోర్టు న్యాయమూర్తి ఎ.హరనాథశర్మ సిద్ధివినాయకుని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



అయినవిల్లి సిద్ధివినాయకునికి అభిషేకం చేస్తున్న దృశ్యం





కిటకిటలాడిన బిక్కవోలు

బిక్కవోలు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి) : బిక్కవోలు భక్తజనంతో కిటకిటలాడింది. వినాయక చవితి సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణంలో క్యూలైన్లు కిక్కిరిశాయి. చెవిలో చెబితే కోర్కెలు నెరవేర్చే బిక్కవోలులోని శ్రీలక్ష్మీగణపతి ఆలయంలో బుధవారం ఉదయం ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మహాలక్ష్మి దంపతులు కలశస్థాపన చేసి ఉత్సవాలు ప్రారంభించారు. అంతకు ముందు తెల్లవారుజామున తీర్థపుబిందె సేవ అనంతరం భక్తులకు స్వామి దర్శనాలు కల్పించారు. స్వామి దర్శనానికి 50 వేల మంది భక్తులు వచ్చారని ఉత్సవకమిటీ అధ్యక్షుడు చాగంటి సాయిబాబారెడ్డి తెలిపారు. తాపేశ్వరం సురుచి ఫుడ్స్ వారు 50 కిలోలు, జి.మామిడాడకు చెందిన రామకృష్ణారెడ్డి 30 కిలోల లడ్డూను స్వామి బహూకరించారు. బిక్కవోలు ఎస్‌ఐ వి. రవిచంద్రకుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

బహురూపుడు.. గణనాథుడు!



లక్ష్మీగణపతి స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కాకినాడ దిగుమర్తివారి వీధిలో లక్షా యాభై వేల గాజులతో తీర్చిదిద్దిన గణనాథుడు చవితి వేళ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. బుధవారం, గురువారం వేలాదిగా భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.



పిఠాపురం మండలం చేబ్రోలు ఆదర్శ్ ఇంజనీరింగ్ కళాశాలలో కొబ్బరితాళ్లతో ఏర్పాటు చేసిన గణనాథుడు

రాజమండ్రి పుష్కరఘాట్ వద్ద నూలు దారాలతో తయారు చేయించిన 18 అడుగుల గణపతి విగ్రహం ఆకర్షణగా ఉంది.





పిఠాపురం జగ్గయ్యచెరువు కాలనీలో శివలింగాకారంలో ఏర్పాటు చేసిన లడ్డూ



పెద్దాపురం మండలం కాండ్రకోటలో ఏర్పాటు చేసిన 21 అడుగుల భారీ మట్టి విగ్రహం వద్ద పూజలు చేస్తున్న నిర్వాహకులు



రాజమహేంద్రవరం లక్ష్మీవారపుపేటలో సిరిధాన్యాలతో గణపతి..



పెరవలి మండలం ముక్కామలలో గణపతిని బుధవారమే నిమజ్జనానికి తరలించారు.. ఉదయం విగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మధ్యాహ్నం నుంచి ఊరేగింపు ఆరంభించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై గణనాథుడికి ఉంచి ఊరేగించారు. గ్రామస్తులు స్వామి వెంట నడిచారు. బైబై గణేశా అంటూ వీడ్కోలు పలికారు.

వైభవంగా రథోత్సవం

- ఘనంగా శ్రీపాదవల్లభుని జయంతి
- ముగిసిన సప్తాహ మహోత్సవాలు







ప్రత్యేక అలంకరణలో శ్రీపాదశ్రీవల్లభులు, దత్తాత్రేయస్వామి, నృసింహ సరస్వతులు, శ్రీపాదశ్రీవల్లభుని రథోత్సవంలో పాల్గొన్న జనసేన ఇన్‌చార్జి శ్రీనివాసరావు, ఈవో సౌజన్య, పాల్గొన్న భక్తులు

పిఠాపురం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): శ్రీపాద వల్లభుని జన్మస్థానంగా దేశవ్యాప్తంగా ప్రాచుర్యం పొందిన పిఠాపురం పట్టణంలోని శ్రీపాద శ్రీవల్లభ మహాసంస్థానంలో శ్రీపాదశ్రీవల్లభుల జయంతిని ఘనంగా నిర్వహించారు. శ్రీపాదశ్రీ వల్లభులు, దత్తాత్రేయస్వామి, నృసింహసరస్వతులను పుష్పాలు, మారేడు దళాలతో విశేషంగా అలంకరించారు. మారేడుదళాలతో ప్రత్యేక పూజలు, పూలంగి సేవ, అభిషేకాలు జరిగాయి. మహాగణపతి పూజ, స్వామి దివ్యపాద పద్ములకు మహాన్యాసపూర్వక శత రుద్రాభిషేకం, సర్వపుష్ప పూజ, శ్రీసూక్త, పురుష సూక్తములతో సహస్ర నామార్చన, మంగళహారతి, వేద పారాయణ, రుత్విక్కులచే దత్త మూలమంత్ర అనుష్ఠానం, గురుచరిత్ర పారాయణ, శ్రీపాద శ్రీవల్లభ చరితామృత పారాయణం జరిగాయి. సాయంత్రం అగ్ని ప్రతిష్ఠాపన, దత్తమంత్ర హోమం, సాయంకాల అర్చన నిర్వహించారు. హోమానికి పూర్ణాహుతి జరిగింది. రాత్రి శ్రీపాదశ్రీవల్లభుల రథోత్సవాన్ని నిర్వహించారు. రథోత్సవాన్ని పిఠాపురం నియోజకవర్గ జనసేనపార్టీ పిఠాపుర నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు ప్రారంభించి పాల్గొన్నారు. రథోత్సవంతోపాటు పూజాది కార్యక్రమాల్లో మహారాష్ట్ర, గోవా, కర్నాటక, ఉభయ తెలుగురాష్ట్రాలు నుంచి తరలివచ్చిన భక్తులు పాల్గొన్నారు. రథోత్సవంలో భాగంగా మహారాష్ట్ర భక్తుల నృత్యాలు, మిరువిట్లు గొలిపే బాణాసంచా ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భక్తులకు మహాన్నదానప్రసాద వితరణ జరిగింది. వారంరోజుల పాటు జరిగిన జయంతి ఉత్సవాలు ముగిశాయి. ఆలయ కార్యనిర్వహణాధికారి ఆర్.సౌజన్య ఏర్పాట్లు పర్యవేక్షించారు.

జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వల్లూరి సూరిబాబు

- సెప్టెంబరు 5న బాధ్యత స్వీకరణ



సీఎం చంద్రబాబుతో వల్లూరి

సామర్లకోట, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వల్లూరి సూర్యప్రకాశరావు (సూరిబాబు) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈమేరకు జిల్లాలోని రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ కార్యాలయంలో సమావేశమయ్యారు. సుదీర్ఘకాలంగా అప్‌లాండ్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న వల్లూరి సూరిబాబు గత పది నెలలుగా రాష్ట్ర రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ కార్యదర్శిగానూ వ్యవహరిస్తున్నారు. బుధవారం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప స్వగృహంలో జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులలో కీలకమైన కొందరు ప్రతినిధులు ఎమ్మెల్యే చినరాజప్పతో సమావేశమయ్యారు. సదరు సమావేశంలో వల్లూరి సూరిబాబును అసోసియేషన్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు స్పష్టం చేశారు. వల్లూరి సూరిబాబును మెజార్టీ రైస్‌మిల్లర్లు ప్రతి పాదించడంతో ఎమ్మెల్యే చినరాజప్ప సంతృప్తి వ్యక్తం చేశారు. సెప్టెంబరు 5న కాకినాడలోజిల్లా అసోసియేషన్ కార్యాలయంలో భారీఎత్తున జరుపనున్న కార్యక్రమంలో వల్లూరి సూరిబాబు బాధ్యతలు స్వీకరించ నున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 115 రైస్‌మిల్లర్లు సెప్టెంబరు 5న నూతన అధ్యక్షుల ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

మెరుగైన సమాజం నిర్మాణంలో
యువత పాత్ర కీలకం

- జేఎన్టీయూకే ఉపకులపతి సీఎస్ఆర్కే ప్రసాద్
- పీఆర్‌లో విద్యార్థులకు ప్రజాస్వామ్యంపై అవగాహన



కార్యక్రమంలో మాట్లాడుతున్న కాకినాడ జేఎన్టీయూ వీసీ సీఎస్ఆర్కే ప్రసాద్

కాకినాడరూరల్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మెరుగైన సమాజం నిర్మాణం, క్రియాత్మక ప్రజాస్వామ్యాన్ని నిర్మించడంలో యువత పాత్ర కీలకమని జేఎన్టీయూకే ఉపకులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్ అన్నారు. కాకినాడ పీఆర్ ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాల్లో మెరుగైన సమాజం కోసం పనిచేస్తున్న పౌరసంఘాలు, యూనివర్శిటీ ఆఫ్ డెమోక్రసీ ఫౌండేషన్, జన విజ్ఞాన వేదిక విద్యార్థులకు ప్రజాస్వామ్యంపై అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించినట్లు కళాశాల ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ హరిరామ్‌ప్రసాద్ తెలిపారు. కాకినాడ జేఎన్టీయూ ఉపకులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. వీసీ మాట్లాడుతూ దేశ నిర్మాణంలో యువ ఓటర్ల పాత్ర ఎంతో ముఖ్యమని తెలిపారు. ఈ సందర్భంగా రాజకీయ శాస్త్రం విద్యార్థులకు సమాజం, ప్రజాస్వామ్యంలో ప్రస్తుత సవాళ్లను ప్రతిబింబించే అంశాలపై వ్యాసరచన, వక్తృత్వం, లఘుచిత్రం విభాగాల్లో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. మన ప్రజాస్వామ్యంలో ఉన్న ప్రస్తుత సవాళ్లను ప్రతిబింబించేలా కళాకారులు బుర్రకథను ప్రదర్శించారు. కార్యక్రమంలో యూనివర్శిటీ ఆఫ్ డెమోక్రసీ ఫౌండేషన్ ఛైర్మన్ జి.అబ్బయ్య, కార్యదర్శి ఆలపాటి శ్రీనివాస్, మెంటార్ కృష్ణమోహన్, ప్రసాద్, డాక్టర్ ఖలీఫా భాషా,సయ్యద్ సలార్, హరికిషన్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సంస్కృతి మనుగడకు..
భాషే ప్రధానం

- భావవ్యక్తీకరణకు మాతృభాషే ఆధారం
- నేడు తెలుగు భాషా దినోత్సవం

కార్పొరేషన్(కాకినాడ), ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మన తల్లిదండ్రులంత గొప్పది మన తెలుగు తల్లి భాష. ఆభాషను గౌరవించుకోవడం, కాపాడుకోవడం ప్రతిఒక్కరి బాధ్యత. తెలుగు భాషకు తిక్కన నుంచి ఎర్రాప్రగడ వరకు-తెలుగు వాగ్గేయకారులు, కవులు మనకు అమూల్యమైన సాహిత్యాన్ని అందించారు. అన్నమయ్య, త్యాగరాజు, గురజాడ, శ్రీశ్రీవంటి మహనీయులు తెలుగుభాషను సాహిత్యం, గీతం, నాటకం ద్వారా అమరంగా నిలిపారు. ఆగస్టు 29న ప్రతిఏటా తెలుగుభాషా దినోత్సవం జరుపుకుంటాం. ఇది గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా జరుపుకోవడం ప్రత్యేకత. ఆయన భాషా ఉద్యమం ద్వారా తెలుగుభాషను సాధారణ ప్రజలకు చేరవేశారు. తెలుగు సాహిత్యాన్ని కాపాడుకునేందుకు జిల్లాలో కొన్ని సంస్థలు ఇప్పటికీ పనిచేస్తున్నాయి. సాహితీ స్రవంతి, ఆస్వాదన సాహితీ సమితి వంటి సంస్థల ద్వారా విద్యార్థులకు, ప్రజలకు తెలుగు సాహిత్యంపట్ల అవగాహన కల్పిస్తూ అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

సాహితీ సేవలో సాహితీ స్రవంతి



ఒక జాతి సంస్కృతినీ, ఔన్నత్యాన్ని తెలియజేయాలన్నా, ఒకరి భావాల్ని మరొకరికి చేరవేయాలన్నా భాషనుమించిన ఉపకరణం మరొకటిలేదు. పరాయిభాషలు ఎన్ని నేర్చుకున్నా, కన్నతల్లి వంటి మాతృభాషను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది. అనేక ఆటుపోట్లకు గురౌతున్న మన తెలుగుభాషను, సాహిత్యానికి జనజీవాలు నింపి కొంత వరకైనా మన భాషను, మన సాహిత్యాన్ని కాపాడుకోవాలని కాకినాడ సాహితీస్రవంతి సంస్థ ద్వారా ప్రతినెలా క్రమం తప్పకుండా పలు సాహిత్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. పుస్తకావిష్కరణలు, ప్రముఖ కవుల జయంతులు, వర్ధంతులు, పుస్తక సమీక్షలూ వంటికి జరుపుతున్నాం. కళాశాలల విద్యార్థులకు కథ, కవిత్వంపై కార్యశాలలు(వర్క్‌షాప్) నిర్వహించి తెలుగు సాహిత్యంపై అవగాహన కల్పిస్తున్నాం.

-మార్ని జానకిరామచౌదరి,
సాహితీ స్రవంతి కాకినాడ నగర అధ్యక్షుడు

నర్సింగ్ సప్లిమెంటరీ పరీక్షల్లో గందరగోళం

జీజీహెచ్(కాకినాడ) ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) కాకినాడ జీజీహెచ్ అధికారుల ఆధ్వర్యంలో రంగరాయ వైద్య కళాశాలలో జరుగుతున్న నర్సింగ్ సప్లిమెంటరీ పరీక్షలో గురువారం గందరగోళం చోటుచేసుకుంది. అక్కడ కాపీయింగ్ జరుగుతుందంటూ కొంతమంది ప్రచారం చేసిన నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. ఆర్ఎంసీలో జీఎన్ఎం పరీక్షలు జరుగుతున్నా పరీక్షల నిర్వహణ బాధ్యతంతా జీజీహెచ్‌దే. పరీక్షల నిర్వహణలో పలు అవకతవకలు చోటు చేసుకున్నాయంటూ చేస్తున్న ప్రచారాల ప్రభావం ఆర్ఎంసీ అధికారులపై పడింది. పరీక్షల బాధ్యతలు పర్యవేక్షిస్తున్న జీజీహెచ్ ఉన్నతాధికారులు కాపీయింగ్ వ్యవహారంపై స్పందించారు. అసలు సంబంధమేలేని రంగరాయ వైద్యకళాశాల అధికారులు పరీక్షల నిర్వహణ తమకు సంబంధం లేదని, కేవలం పరీక్షల నిర్వహణ కోసం రూమ్స్‌ను వినియోగించుకునేందుకు అనుమతులు మాత్రమే ఇచ్చామని వారు తెలిపారు.

అష్టజ్యోతిర్లింగాలకు ఆర్టీసీ బస్సు



అష్టజ్యోతిర్లింగాల యాత్ర బస్సును ప్రారంభిస్తున్న డీఎం కుమార్

రావులపాలెం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): రావులపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి అష్టజ్యోతిర్లింగాలు, పంచద్వారకులకు ప్రత్యేక ఆర్టీసీ బస్సు గురువారం బయలుదేరి వెళ్లింది. ఈ బస్సును ఆర్టీసీ డీఎం కుమార్ ప్రారంభించారు. బసవకళ్యాణ్, తుల్జాపూర్, భీమశంకర్ జ్యోతిర్లింగం, పర్లి వైద్యనాథ్ జ్యోతిర్లింగం, షిరిడి, గృష్ణేశ్వర జ్యోతిర్లింగం, ఎల్లోరా, నాసిక్, త్రయంబకేశ్వర్ జ్యోతిర్లింగం, డాకోర్, నిష్కలంక మహాదేవ్, , బాగ్ధాన, సోమనాథ్ జ్యోతిర్లింగం, నాగేశ్వర్ జ్యోతిర్లింగం, ద్వారకా, బేట్ ద్వారకా, మేడేరా, నాథద్వార్, రాజ్యసమండ కంక్రోలి, ఉజ్జయిని మహాకాలేశ్వర్ జ్యోతిర్లింగం, ఓంకారేశ్వర జ్యోతిర్లింగం, ఏకవిరిక శక్తిపీఠం, బాసర పుణ్యక్షేత్రాల దర్శనం అనంతరం సెప్టెంబరు 11న రావులపాలెం చేరుతుందన్నారు. టిక్కెట్ ధర రూ.21వేలుగా నిర్ణయించారు.

వెయ్యి కోట్ల కుంకుమార్చన లక్ష్యంగా
మహాశక్తి యాగం

- ఐశ్వర్య రక్ష కంకణాల పంపిణీకి ఏర్పాట్లు
- సెప్టెంబరు 22 నుంచి అక్టోబర్ 3 వరకు యాగం
- స్వామి పరిపూర్ణానంద సరస్వతి



సర్పవరంజంక్షన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): వెయ్యి కోట్ల కుంకుమార్చన లక్ష్యంగా కాకినాడ శ్రీపీఠంలో సెప్టెంబరు 22 నుంచి అక్టోబరు 3వరకు మహాశక్తి యాగం-2025 నిర్వహించనున్నట్లు స్వామి పరిపూర్ణానంద సరస్వతి తెలిపారు. గురువారం కాకినాడ రూరల్ రమణయ్యపేట శ్రీపీఠం వ్యవస్థాపకుడు స్వామి పరిపూర్ణానంద సరస్వతి విలేకరులతో మాట్లాడారు. దేవీశరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా 11 రోజులపాటు జరిగే మహాశక్తి యాగంలో భాగంగా వంద కోట్ల కుంకుమార్చనలో పాల్గొనేందుకు వివిధ రాష్ట్రాలకు చెందిన భక్తులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకుంటామన్నారు. దసరాకు జరిగే మహాశక్తియాగంలో 300కోట్ల కుంకుమార్చనకు చారిత్రక ఘట్టానికి కాకినాడ శ్రీపీఠం వేదిక కాబోతుందన్నారు. వందకోట్ల కుంకు మార్చనతో పాటూ వారాహి, ప్రత్యంగిరా, బగళాముఖి, రాజశ్యామల, చండీ, సహస్ర రుద్ర మహారుద్రహోమాలన్నీ విశేష సంఖ్యలో నిర్వహించేందుకు ఆయా విభాగాల నిపుణుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. మాతృమూర్తి స్వర్గీయ సంకల్పం మేరకు ఆమె దాచుకున్న సొమ్ముతో మహాశక్తి యాగంలో పాల్గొన్న భక్తులకు స్వచ్ఛమైన రాగితో తయారుచేసిన ఐశ్వర్య రక్ష కంకణం పంపిణీకి శ్రీకారం చుడతామన్నారు. దాతలు, భక్తుల సహకారంతో కోటి మందికి అమ్మవారి ప్రసాదం పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. దేవీ శరన్నవ రాత్రుల్లో భాగంగా ఐశ్వర్యాంబిక అమ్మవారు పలురకాల దివ్య అలంకరణలతో భక్తులకు దర్శనమిస్తారన్నారు. ఈ మహాయజ్ఞంలో పాల్గొని వంద కోట్ల కుంకుమార్చన ఫలితంతో పాటూ ఐశ్వర్యాంబిక అమ్మకృపకు పాత్రులుకావాలని ఆకాంక్షించారు.

ప్రభుత్వ, ప్రైవేటు ఐ.టి.ఐ.ల్లో మూడో విడత కౌన్సెలింగ్

కార్పొరేషన్(కాకినాడ), ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి):కాకినాడ, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో గల ప్రభుత్వ ప్రైవేటు ఐ.టి.ఐ.ల్లో 2025-26కుగాను మూడో విడత కౌన్సెలింగ్ కోసం హాజరు కావాల్సిందిగా అభ్యర్థులను కాకినాడ ప్రభుత్వ ఐ.టి.ఐ. ప్రిన్సిపాల్, కాకినాడ, కోనసీమ జిల్లాల కన్వీనర్ ఎం.వేణుగోపాల వర్మ కోరారు. ఏ ఐటీఐలో చేరాలనుకుంటున్నారో ఆ ఐటీఐలలో మూడో విడత రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ వెరిఫికేషన్ చేయించుకున్న వారు తమ ఒరిజినల్ సర్టిఫికేట్స్, వెరిఫికేషన్ స్లిప్‌లను ఈనెల 29న, ప్రైవేట్ ఐటీఐలో అయితే ఈనెల 30న ఉదయం 8 గంటలకు కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని వేణుగోపాలవర్మ తెలిపారు. వివరాలకు 08842348182/ 9440428182లో సంప్రదించాలి అన్నారు.

తర్జనభర్జన

- చేబ్రోలులో అర్ధరాత్రి వరకూ డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్
- సర్వర్‌లో సాంకేతిక సమస్యతో ఆలస్యం
- 1351 మందికి 1,029 అభ్యర్థులకే జనరేట్ అయిన కాల్‌లెటర్లు
- కొందరికి రాత్రి వరకూ జనరేట్ అయిన కాల్‌లెటర్లు
- అర్ధరాత్రి దాటినా కొనసాగుతున్న ప్రక్రియ
- నేడూ వెరిఫికేషన్ ..
- ఫిట్స్‌తో అస్వస్థతకు గురైన అభ్యర్థి

గొల్లప్రోలురూరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని ఆదర్శ్ ఇంజనీరింగ్ కళాశాలలో డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ గురువారం ప్రారంభమైంది. సర్వర్‌లో సాంకేతిక సమస్యలతో సర్టిఫికెట్లు తనిఖీ, ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ అధిక సమయం తీసుకుంటుండడంతో ప్రక్రియ ఆలస్యంగా సాగుతోంది. అర్ధరాత్రి దాటిన తర్వాత సర్టిఫికెట్ల పరిశీలనను అధికారులు కొనసాగిస్తున్నారు. శుక్రవారం ఈ ప్రక్రియ కొనసాగనున్నది. మెగా డీఎస్సీ 2025 మెరిట్‌లిస్ట్‌లో ఉండి కాల్‌లెటర్లు అందుకున్న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన అన్ని కేటగిరీల అభ్యర్థులకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ కోసం నియమించిన 25 ప్రత్యేక బృందాలు ధృవీకరణపత్రాల తనిఖీ ప్రారంభించారు. గురువారం నాటికి అప్‌డేట్ అయిన సమాచారం ప్రకారం 1351 మంది అభ్యర్థుల సర్టిఫికెట్లును ఈ బృందాలు పరిశీలించాల్సి ఉంది. అయితే గురువారం సాయంత్రం వరకూ 1029 మంది అభ్యర్థుల కాల్‌లెటర్లు మాత్రమే జనరేట్ అయ్యాయి. మిగిలిన వారికి కాల్‌లెటర్లు జనరేట్ కాలేదు. అయిదు బృందాలకు సంబంధించి ఒక్క కాల్‌లెటర్ జనరేట్ కాకపోవడంతో మిగిలిన 20 బృందాలే పరిశీలన పక్రియ చేపట్టాయి. ఉదయం 7 గంటలకే సర్టిఫికెట్లు వెరిఫికేషన్ జరుగుతున్న కళాశాల ప్రాంగణానికి అభ్యర్థులు, వారి కుటుంబసభ్యులు, బంధువులు, సహాయకులతో కలిసి వచ్చారు పది గంటలకు వెరిఫికేషన్ పక్రియ ప్రారంభించారు. గురువారం కాల్ లెటర్లు అందుకున్న అభ్యర్థులు శుక్రవారం ఉదయం తొమ్మిది గంటల కల్లా హాజరుకావాలని డీఈవో తెలిపారు.


ఆదర్శ్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆరుబయట వేచియున్న అభ్యర్థుల బంధువులు, (ఇన్‌సెట్లో) ఆరునెలల చిన్నారితో వచ్చిన కొత్తపల్లికి చెందిన సౌజన్య

వెంటాడిన సాంకేతిక సమస్యలు

అభ్యర్థులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన సర్టిఫికెట్లును ఫిజకల్‌గా తీసుకువచ్చిన ఒరిజనల్ సర్టిఫికెట్లుతో సరిచూసి తనిఖీ అనంతరం వాటిని మరలా బృందాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. రాష్ట్రవ్యాప్తంగా ఒకే సమయంలో పక్రియ జరుగుతున్న నేపధ్యంలో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్‌కు అధిక సమయం తీసుకుంది. అది కాక సర్వర్‌లో సాంకేతిక సమస్యలతో పక్రియ ఆలస్యంగా జరిగింది. రాత్రి 8గంటల వరకూ కేవలం 680మంది అభ్యర్థుల సర్టిఫికెట్లు వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తయింది. అర్ధరాత్రి 12 గంటల దాటిన తర్వాత వెరిఫికేషన్ పక్రియను అధికారులు కొనసాగిస్తున్నారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ శుక్రవారం కొనసాగుతుందని విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ మువ్వా రామలింగం తెలిపారు. కాకినాడ డీఈవో పిల్లి రమేష్‌తో కలిసి పక్రియ జరుగుతున్న తీరుని ఆయన పరిశీలించారు. అందరి అభ్యర్థులకు కాల్‌లెటర్లు జనరేట్ అవుతాయని ఎవరు అందోళన చెందవలసిన అవసరం లేదని స్పష్టంచేశారు. సాయంత్రం నుంచే కొందరి అభ్యర్థులవి జనరేట్ అవుతున్నాయని తెలిపారు. వెరిఫికేషన్ పక్రియలో కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, అల్లూరి సీతారామరాజు జిల్లాల డీఈవోలు, డీవైఈవోలు, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు. కాగా అభ్యర్థులు, వారి సహాయకులకు యూటీఎఫ్ ఆధ్వర్యంలో భోజనం, టిఫిన్ సదుపాయం కల్పించారు.

ఫిట్స్ వచ్చి అస్వస్థత

తూర్పుగోదావరి జిల్లా రంగంపేటకు చెందిన అభ్యర్థి దాదాజీ రూమ్ నెంబరు 17లో జరుగుతున్న సర్టిఫికెట్లు వెరిఫికేషన్ పక్రియకు హాజరయ్యారు. ఆ సమయంలో ఫిట్స్ వచ్చి అస్వస్థతకు గురయ్యారు. వెంటనే తనిఖీబృందాల సభ్యులు వచ్చి ఇనుప తాళం చెవి పెట్టడంతో తేరుకున్నారు. అనంతరం అతను ఎస్జీటీ పోస్టుకు సంబంధించి సర్టిఫికెట్లు వెరిఫిషన్ చేయించుకున్నారు.

401వ ర్యాంకు వచ్చినా

కాకినాడకు చెందిన కొల్లు లావణ్యకు డీఎస్సీలో 401వ ర్యాంకు వచ్చి ఎస్జీటీ పోస్టుకు ఎంపికయ్యారు. అయితే ఈమెకు గురువారం సాయంత్రం వరకూ కాల్‌లెటరు జనరేట్ కాలేదు. దీనితో చేబ్రోలు వచ్చి ఇక్కడ విద్యాశాఖ ఉన్నతాధికారులను కలిసింది. రాత్రికి లేదా ఉదయానికి కాల్‌లెటర్ వస్తుందని, శుక్రవారం రావాలని అధికారులు సూచించారు.

చిన్నారులతో వచ్చి

డీఎస్సీకి ఎంపికైన పలువురు మహిళా అభ్యర్థులు ఏడాది లోపు చిన్నారులతో సర్టిఫికెట్లు వెరిఫికేషన్ పక్రియకు వచ్చారు. వీరికి భర్త లేదా, తల్లులు తోడుగా వచ్చారు. అధిక సమయం తీసుకోవడంతో చిన్నారులను ఊరుకోబెట్టడానికి ఇబ్బందులు పడ్డారు.

అంతర్ జిల్లాల దొంగల ముఠా అరెస్టు

- లారీల బ్యాటరీలు చోరీ చేస్తూ అమ్మకాలు
- 18 బ్యాటరీలు స్వాధీనం
- ఇద్దరు నిందితుల అరెస్టు


దొంగిలించిన బ్యాటరీలు, ముద్దాయిలతో ఆలమూరు పోలీసులు

ఆలమూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): పార్కు చేసిన ఉన్న లారీల బ్యాటరీలను దొంగిలించి అమ్మకాలు చేస్తున్న అంతర్ జిల్లాల దొంగల ముఠాను ఆలమూరు పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఆలమూరు ఎస్ఐ జి.నరేష్ తెలిపిన వివరాల ప్రకారం ఆగస్టు 18న రాత్రి చొప్పెల్ల, జొన్నాడ ప్రాంతాలలో పార్కింగ్ చేసిన లారీల నుంచి 10 బ్యాటరీలు, అలాగే రావులపాలెం మండలం గోపాలపురంలో 4, జూలై నెలలో కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో నాలుగు బ్యాటరీలు దొంగతనానికి గురికావడం జరిగింది. ఈమేరకు జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రత్యేక టీంను తయారు చేసి విచారణ చేయగా ఎన్టీఆర్ జిల్లా చంద్రపాలం మండలానికి చెందిన ఇరువురు ముద్దాయిలుగా గుర్తించి ఆమేరకు సీసీ కెమెరా ఆధారంగా వివరాలు సేకరించి స్పెషల్ టీం కృషితో ఇరువురు ముద్దాయిలను అదుపులోకి తీసుకుని విచారించడం జరిగిందన్నారు. దీంతో వారు దొంగిలించిన 18 బ్యాటరీలు, తరలించిన వ్యాన్‌ను స్వాధీనం చేసుకుని చవల శ్రీనివాస్, వనపర్తి ఉదయకిరణ్ అనే ముద్దాయిలను అరెస్టు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. వీరిపై ఆలమూరు, రావులపాలెం, కొత్తపేటలలో కేసులు నమోదు చేయడం జరిగిందని ఎస్ఐ నరేష్ వివరించారు. చోరీకి గురైన బ్యాటరీల సుమారు రూ.2.5 లక్షలు నిర్ధారించడం జరిగిందని బ్యాటరీలు లారీ యాజమాన్యులను అందించినట్లు ఆయన చెప్పారు. బ్యాటరీలు స్వాధీనం చేసుకోవడం, ముద్దాయిలను అదుపులోనికి తీసుకోవడంతో కృషి చేసిన సిబ్బంది చిట్టిబాబు, మూర్తిను అభినందించారు. ముద్దాయిలను ఆలమూరు కోర్టులో హాజరుపరచగా ముద్దాయిలకు న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు చెప్పారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి

- ఐదుగురికి తీవ్ర గాయాలు
- మూలపేటలో వాలీబాల్ స్తంభం ఏర్పాటు చేస్తుండగా...

కొత్తపల్లి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): వాలీ బాల్ కోర్టులో ఇనుప స్తంభం ఏర్పాటు చేస్తుండగా సమీపంలో విద్యుత్ తీగలకు తగిలి షాక్‌కొట్టిన కొట్టిన సంఘటనలో యువకుడు మృతి చెందగా, మరో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం మూలపేటలో బుధవారం చోటు చేసుకొంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వినాయక చవితి సందర్భంగా పాఠశాలలకు సెలవు కావడంతో మూలపేటకు చెందిన ఏడిద చరణ్ (19) వల్లూరి నగేష్, మడికి నిఖిల్, విష్ణు, రాజు కలిసి స్థానిక ఉన్నతపాఠశాల ఎదురుగా శివాలయం సమీ పంలో ఉన్న వాలీబాల్ కోర్టులో స్తంభం ఏర్పాటుచేసేందుకు సన్నాహాలు చేశారు. గొయ్యిలో స్తంభం నిలబెట్టేందుకు ఆరుగురు యువకులు ప్రయత్నం చేసేలోగా స్తంభం పక్కనే ఉన్న హైవోల్టేజి కరెంటు స్తంభంపై పడింది. దీంతో విద్యుత్‌షాక్‌తో చరణ్ (19) అక్కడిక్కడే ప్రాణాలు విడిచాడు. నగేష్, నిఖిల్, విష్ణు,తేజ, రాజుకు తీవ్ర గాయాలవడంతో తొలుత పిఠాపురం జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ నుంచి అత్యవసర చికిత్స కోసం కాకినాడ జనరల్ ఆసుపత్రికి అంబులెన్స్‌లో తరలించారు. కొత్తపల్లి ఎస్ఐ జీ. వెంకటేష్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.


మృతిచెందిన ఏడిద చరణ్ (ఫైల్)

పెద్దాపురంలో లైన్‌మెన్..

- మరొకరికి తీవ్రగాయాలు

పెద్దాపురం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో లైన్‌మెన్ మృతి చెందగా, మరొక వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన పెద్దాపురంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలివి.. స్థానిక కొండయ్యపేటకు చెందిన కే. రామకృష్ణ స్థానిక పాశిల వీధిలో సహచరుడు చిన్నితో కలిసి విద్యుత్ మరమ్మతులు చేస్తున్నారు. ఈలోగా ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ ప్రసరించడంతో రామకృష్ణ షాక్‌కు గురయ్యాడు. ఇలాగా అతన్ని కాపాడే ప్రయత్నంలో చిన్నబాబుకు తీవ్ర గాయాలయ్యాలు. దీన్ని గమనించిన విద్యుత్ సిబ్బంది గాయపడినవారిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అప్పటికే రామకృష్ణ మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. కాగా, చిన్నిబాబును మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు రిఫర్ చేశారు. కేవలం విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే మృతి చెందినట్టు మృతిడి బంధువులు ఆరోపించారు.


విద్యుదాఘాతంతో మృతిచెందిన రామకృష్ణ

ఈ విషయంపై సీఐ విజయం శంకర్ పర్యవేక్షణలో ఎస్ఐ మౌనిక కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం తాగడానికి డబ్బులివ్వలేదని..

తండ్రిపై తనయుడి దాడి

- తీవ్ర గాయంతో చికిత్స పొందుతూ మృతి
- ఉండ్రాజవరం మండలం దమ్మెన్నులో ఘటన

ఉండ్రాజవరం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): తండ్రిపై తనయుడు దాడి చేసిన సంఘటన ఉండ్రాజవరం మండలం దమ్మెన్నులో బుధవారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలివి.. గ్రామానికి చెందిన కొల్లి కృష్ణయ్య (65) గతంలో రిక్షా నడుపుతూ జీవనం సాగించేవాడు. ప్రస్తుతం వృద్ధాప్యం కారణంగా రిక్షా తొక్కలేక కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కాగా, ఈయన భార్య కొన్నేళ్ల క్రితం మరణించింది. ఇతనికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. వారందరికీ వివాహాలయ్యాయి. అయితే కృష్ణయ్య కూలి పనులకు వెళ్లిన డబ్బులతో మద్యం సేవించి వస్తూ స్థానిక కమ్యూనిటీ హాలు వద్ద న్యూసెన్స్ చేస్తున్నాడని, దీంతో తమ పరువుపోతుందని కొడుకు సుధాకర్ తరచూ తండ్రిని మందలించేవాడు. కాగా, మంగళవారమూ అదే కమ్యూనిటీ హాలు వద్ద తండ్రి ఉండటాన్ని గమనించి కొడుకు సుధాకర్ మద్యం తాగడానికి తనకు డబ్బులు కావాలని అడగ్గా, ఇవ్వకపోవడంతో కాలితో తన్ని కర్రతో తలపై కొట్టడంతో కృష్ణయ్యకు తీవ్రగాయాలయ్యాయి. దీంతో ఆయన్ని తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడ నుంచి వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం ఏలూరు ఆసుపత్రికి తరలించిగా, చికిత్స పొందుతూ బుధవారం రాత్రి కృష్ణయ్య మరణించాడు. మృతుడు కుమారుడు కొల్లి నాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉండ్రాజవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


కొల్లి కృష్ణయ్య (ఫైల్)

మళ్లీ పెరుగుతోంది..

- ఉధృతమవుతున్న గోదావరి
- ధవళేశ్వరం వద్ద నేటి సాయంత్రానికి మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం

ధవళేశ్వరం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): కొద్ది రోజుల క్రితం ఉప్పొంగి ప్రవహించి ధవళేశ్వరం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక దాటి ప్రవహించిన గోదావరి మళ్లీ ఉధృతమవుతోంది. అల్ప పీడన ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు ప్రాణహిత, ఇంద్రావతి, తాలిపేరు, శబరి నుంచి వరద ప్రవాహం గోదావరిలో కలుస్తూ ఉండడంతో ధవళేశ్వరం వద్ద గోదావరి వరద పెరుగుతోంది.దీంతో కాటన్ బ్యారేజ్ మొత్తం గేట్లను 1.5మీటర్ల మేర పైకి ఎత్తి 5,15,938 క్యూసెక్కులను సముద్రంలోకి వదిలివేస్తూ గోదావరి బేసిన్‌ను ఖాళీ చేస్తున్నారు. దీంతో ధవళేశ్వరం వద్ద గురువారం సాయంత్రానికి నీటి మట్టం 10.40 అడుగులగా నమోదయింది. ఎగువ నుంచి వచ్చే వరద ప్రవాహా న్ని అంచనా వేస్తూ శు క్ర వారం సాయంత్రాని కి ధవళేశ్వరం వద్ద నీ టి మట్టం మొదటి ప్ర మాద హెచ్చరిక స్థా యికి చేరుకుంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.భద్రాచలం వద్ద క్రమంగా పెరుగుతున్న నీటి మట్టం సాయంత్రానికి 38.60 అడుగులకు చేరుకుంది.

కలప కోసం..



కూనవరం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): శబరి నది ఉప్పొంగిన ప్రతిసారి ఆ నదిలో నుంచి విలువైన కలప కొ ట్టుకు వస్తుంది. దానిని పట్టుకోవడానికి ప్రతిసారి ఇక్కడ యువత పెద్ద సాహసమే చేస్తారు. శబరి బ్రిడ్జి పైనుంచి (సుమారు 40 అడుగుల ఎత్తు) ఒకేసారి దూకేస్తారు. నదిలో కొట్టుకుపోతున్న కలపను ఆమాంతం పట్టేస్తారు. సుమారు ఐదు కిలోమీటర్లు నదిలో ఈదుతూ వాటిని ఒడ్డుకు తీసుకొస్తారు.

నిలిచిన రాకపోకలు

చింతూరు/వీఆర్ పురం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ఎడతెరపి లేని వర్షాల ప్రభావంతో శబరి, గోదావరి, సీలేరు నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. చింతూరు వద్ద గురువారం రాత్రి 7గంటలకు శబరి 36 అడుగుల మేర ప్రవహిస్తోంది. అదే దశలో భద్రాచలం వద్ద గోదావరి 38.60 అడుగుల మేర ప్రవహిస్తోంది.దీంతో మన రాష్ట్రం మీదుగా ఛత్తీస్‌గఢ్, ఒడిస్సాలకు వెళ్లే రహదారులు మూసుకపోయాయి. ఒడిస్సాకు వెళ్లే 326వ నెంబరు జాతీయ రహదారిపై చింతూరు మండలం, నిమ్మలగూడెం-కుయుగూరుల నడమ రహదారి పూర్తిగా ముంపునకు గురైంది. ఛత్తీస్‌గఢ్‌కు వెళ్లే 30నంబరు జాతీయ రహదారిపై ఎర్రబోరు పరిసర ప్రాంతంలో రహదారిపై వరద నీరు చేరుకుంది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. చీకటివాగు, సోకిలే రు వాగుల్లో భారీగా వరద నీరు చేరడంతో చింతూరు వరరాచమంద్రపురం మండలాల నడుమ రాకపోకలు నిలిచిపోయాయి. కల్లేరు, ముకునూరు, ఏజీ కోడేరు, రామన్నపాలెం, పెద్ద సీతనపల్లి పంచాయతీల గ్రామాలు జలదిగ్బంధంలో ఉన్నాయి. దీంతో ఆ ప్రాంత వాసులు నిత్యావసర వస్తువుల కోసం అవస్థలు పడుతున్నారు. శబరి ఉధృతి గురువారం ఉదయం నుంచి కాస్త తగ్గుముఖం పట్టినప్పటికీ కూనవరం వద్ద గోదావరి నది ఎగపోటుని వ్వడంతో ఆ ప్రభావం లోతట్టు ప్రాంతాలపై పడింది. కాగా అధికారులను అప్రమత్తం చేశామని చింతూరు పీవో శుభం నొక్వాల్ పేర్కొ న్నారు. వీఆర్ పురం మండలంలోని చింతూరు, వీఆర్ పురం మండలాల ప్రధాన రహదారులపై వరదనీరు చేరడంతో మండల కేంద్రానికి రాకపోకలు నిలిచాయి. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 39 అడుగులకు చేరుకుంది. వరద ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. వారం రోజుల వ్యవధిలో గోదావరి వరదలు రెండో సారి రావడంతో వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు.


ధవళేశ్వరం వద్ద గోదావరి ఉధృతి


చింతరేవుపల్లి-కన్నాయిగూడెం రోడ్డుపైకి చేరిన వరదనీరు


నిమ్మలగూడెం -కుయుగూరు హైవేపై వరదలో చిక్కుకున్న లారీ


నిమ్మలగూడెం-కుయుగూరు హైవేపై వరద నీరు

గోదావరిలో వృద్ధుడి గల్లంతు!

పోలీసుల ముమ్మర గాలింపు చర్యలు


కేదార్లంక నదిలో గాలిస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్, పోలీసులు, చిట్టియ్య(ఫైల్)

కపిలేశ్వరపురం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం కేదార్లంక పంచాయతీ శివా రు వీధివారి లంకకు చెందిన పల్లి చిట్టియ్య (65) బుధవారం తాతపూడి లంకకు వెళ్లి తిరిగి రాలేదు. గోదావరిలో పడి గల్లంతై ఉండవచ్చని స్థానికుల నుంచి అనుమానం వ్యక్తమవుతోంది. దీంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. గల్లంతైన వ్యక్తి కోసం నదిలో ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందంతో కలిసి రెవెన్యూ, పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. రామచంద్రపురం ఎస్‌డీపీవో రఘువీర్ పర్యవేక్షణలో ట్రైనీ డీఎస్పీ ప్రదీప్తి, మండపేట రూరల్ సీఐ దొరరాజు, అంగర ఎస్ఐ హరీష్‌కుమార్, తహశీల్దార్ శ్రీనివాస్, గోదావరి తొగరపాయవద్ద గాలింపు చర్యల్లో పాల్గొన్నారు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో గాలింపు కష్టతరంగా మారిందని పోలీసులు తెలిపారు. దీనికి సంబంధించి ఏమైనా ఆచూకీ తెలిసిన వారు అంగర ఎస్ఐ సెల్ 9440900770, మండపేట సీఐ సెల్ 9440796537 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

మహిళలే టార్గెట్..

- అంతర్ జిల్లాల చైన్ స్నాచింగ్ ముఠా గుట్టురట్టు
- రూ.17 లక్షల బంగారం స్వాధీనం
- 6 కేసుల్లో ఇద్దరు నిందితుల అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న రాజోలు సీఐ నరేష్‌కుమార్

రాజోలు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మహిళల మెడలో గొలుసులు లాక్కుని వెళుతున్న అంతర్‌జిల్లాల చైన్ స్నాచింగ్ ముఠాను రాజోలు పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి రూ.17.30 లక్షల విలువచేసే 171 గ్రాముల బంగారం, 200 గ్రాముల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామని రాజోలు సీఐ టీవీ నరేష్‌కుమార్ తెలిపారు.రాజోలు పోలీసు సర్కిల్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం క్రైమ్ సీఐ ఎం.గజేంద్రకుమార్, రాజోలు సీఐ టీవీ నరేష్‌కుమార్, ఎస్ఐ బి.రాజేష్‌కుమార్, సిబ్బంది బుధవారం రాజోలు మండలం శివకోటి వై.జంక్షన్ వద్ద ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం టౌన్‌కు చెందిన పి.పాండురంగారావు, ఏలూరు జిల్లా కలిదిండి మండల కలిదిండి గ్రామానికి చెందిన ఎల్.మురళీకృష్ణను చైన్ స్నాచింగ్ కేసులో అరెస్టు చేశామని తెలిపారు. పాండురంగారావు భీమవరంలో అమృత పేరు మీదుగా టిఫిన్ సెంటర్ నడుపుతూ పేకాట, క్రికెట్ బెట్టింగ్‌లకు అలవాటు పడి వ్యాపారంలో వచ్చే సంపాదన సరిపోక అప్పుల పాలయ్యాడు. సులభంగా డబ్బు సంపాదించాలని చైన్ స్నాచింగ్, ఇతర దొంగతనాలు చేయడం మొదలుపెట్టాడు. పాండురంగారావుపై డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఏలూరు జిల్లాల్లో ఆరుకు పైగా దొంగతనాల కేసులు ఉన్నాయి. మురళీకృష్ణ.. కలిదిండిలోని సినీ ఆర్కెస్ట్రాలో ప్యాడ్స్ కొడుతూ జీవనం సాగిస్తున్నాడు. కొవిడ్ సమయంలో ఆర్కెస్ట్రాలో ప్రోగ్రాంలు లేక పాండురంగారావు హోటల్‌లో మూడేళ్లు పనిచేశాడు. ఆ సమయంలో పాండురంగతో కలిసి మద్యం పేకాటలకు అలవాటు పడ్డాడు. సంపాదన సరిపోకపోవడంతో అప్పులు చేయడంతో సులభంగా డబ్బు సంపాదించాలనే పాండురంగతో కలిసి చైన్ స్నాచింగ్, ఇతర దొంగతనాలు చేశాడు. చోరీ కేసులను ఛేదించడంలో కృషి చేసిన క్రైమ్ సీఐ, స్థానిక సీఐ వారి సిబ్బందిని జిల్లా ఎస్పీ కృష్ణారావు అభినందించారు.

ఇద్దరు దొంగలు అరెస్టు

- ధర్మవరం చోరీ ఘటనలో రూ.6.3 లక్షల బంగారు ఆభరణాలు స్వాధీనం
- పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీహరిరాజు, చోరీ సొత్తు

ప్రత్తిపాడు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరంలో జరిగిన చోరీ ఘటనకు సంబంధించి ఇద్దరు నిందితులను అరెస్టు చేసి, రూ.6.3 లక్షలు విలువలైన 23 తులాల బంగారం, 90 గ్రాముల వెండిని పోలీసులు స్వాధీన పరుచుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను గురువారం సాయంత్రం ప్రత్తిపాడు పోలీస్‌స్టేషన్ వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ డి.శ్రీహరిరాజు వెల్లడించారు.రాజమహేంద్రవరంలోని భవానీపురం క్వారీ సెంటర్‌కు చెందిన కొవ్వూరి సునీల్, రాజమహేంద్రవరం రూరల్ మండలం తొర్రేడు గ్రామానికి చెందిన మోర్తా దీవెన రాజు.. ఈ నెల 21న రాజమహేంద్రవరం నుంచి గంటకు రూ.250 అద్దెకు బైక్ తీసుకున్నారు. ప్రత్తిపాడు మండలంలోని ధర్మవరం వెళ్లి స్థానిక జగనన్న కాలనీలో గాలి తలుపులయ్య పగటిపూట ఇంట్లోకి చొరబడి 247 గ్రాముల బంగారు, 90 గ్రాముల వెండి, 3 గ్రాముల ప్లాటినం ఉంగరాలను అపహరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. చోరీకి ముందు ఇంటి పరిసరాల్లో రెక్కీ నిర్వహించడం, తదనంతరం ముసుగులు ధరించి ఇద్దరు చోరీకి పాల్పడడం తలుపులయ్య ఇంటి పరిసరాల్లోని సీసీ కెమెరాల్లో రికార్డ్ అయ్యాయి. గురువారం ఇద్దరు వ్యక్తులు ప్రత్తిపాడు పాదాలమ్మ ఆలయం వద్ద అనుమానాస్పద రీతిలో తిరుగుతుండగా సీఐ బి.సూర్య అప్పారావు, ఎస్ఐ లక్ష్మీకాంతం అదుపులోకి తీసుకుని విచారించగా ధర్మవరం జగన్న కాలనీలో చోరీకి పాల్పడిన విషయం బయట పెట్టారని డీఎస్పీ శ్రీహరిరాజు తెలిపారు. అలాగే చోరీకి ఉపయోగించిన బైక్‌తో పాటు ఐరన్ కటింగ్ మిషన్‌ను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. నిందితుల్లో ఒకరు మైనర్ అని పేర్కొన్నారు. 45 గంటల వ్యవధిలో చోరీని ఛేదించిన సీఐ సూర్య అప్పారావు, ఎస్.లక్ష్మీకాంతంతో పాటు ప్రత్యేక పోలీస్ బృందాన్ని ఎస్పీ బిందుమాధవ్, డీఎస్పీ శ్రీహరిరాజు అభినందించారు. నేరాల గుర్తింపులో సీసీ కెమెరాలు కీలకంగా మారిన దృష్ట్యా ఇళ్ల వద్ద, వ్యాపారులతో పాటు, దేవాలయాలు ఇతర సంస్థల వద్ద వాటిని నిర్వాహకులు ఏర్పాటు చేసుకోవాలని డీఎస్పీ చెప్పారు.



విద్యార్థిపై దాడిలో కేసు నమోదు

ఇద్దరు అరెస్ట్.. జువైనల్ కోర్టుకు బాలురు

రాజమహేంద్రవరం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మోరంపూడిలోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్‌లో పదో తరగతి విద్యార్థిపై దాడి ఘటనకు సంబంధించి పోలీసులు కేసు నమోదు చేశారు. బొమ్మూరు సీఐ కాశీ విశ్వనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. స్కూల్‌లోని తన సహచర విద్యార్థులు సీసీ కెమెరాలను తొలగించి తమ వద్ద దాచుకున్న విషయాన్ని ఓ విద్యార్థి ప్రిన్సిపాల్‌కి చెప్పాడు. దీంతో అతడిని చంపాలనే ఉద్దేశంతో ఆ ఇద్దరు విద్యార్థులు కర్రలతో కొట్టి, ఐరన్ బాక్స్‌ని వేడి చేసి శరీరంపై పలుచోట్ల గాయాలు చేశారు. దీనిపై ఆ ఇద్దరు విద్యార్థులను జువైనల్ కోర్టులో హాజరు పరిచినట్టు సీఐ తెలిపారు. ప్రిన్సిపాల్ గుట్టుపల్లి మధుసూదన్, హాస్టల్ ఫ్లోర్ ఇన్‌చార్జి పల్లి దామోదర్‌ని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచామన్నారు.

చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయండి
ఐ.పోలవరం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): సెప్టెంబరు 9న తలపెట్టిన దివ్యాంగుల చలో హైదరాబాదు కార్యక్రమాన్ని విజయవంతం చెయ్యాలని దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు జంపన రామభద్రరాజు పిలుపునిచ్చారు. మురమళ్ళ లైన్‌పేటలో వీహెచ్‌పీఎస్ దివ్యాంగుల 18వ ఆవిర్భావ దినోత్సవం గురువారం జరిగింది.

టీబీ ముక్తభారత్ అభియాన్
అంతర్వేది, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): గొందిలో రామేశ్వరం పీహెచ్‌సీ, 104 భవ్య హెల్త్ సర్వీస్ ఆధ్వర్యంలో టీబీ ముక్తభారత్ అభియాన్ వైద్య శిబిరం నిర్వహించారు. 50మంది అనుమానిత రోగుల నుంచి శాంపిల్స్ సేకరించి పరీక్షలకు పంపించారు. 104 భవ్య హెల్త్ సర్వీస్ సిబ్బందితో పాటు రామేశ్వరం పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

వీహెచ్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవం


వీహెచ్‌పీఎస్ జెండా ఆవిష్కరిస్తున్న నలమాటి లంకరాజు

ముమ్మిడివరం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఆవిర్భావ దినోత్సవాన్ని ముమ్మిడివరంలో గురువారం ఘనంగా నిర్వహించారు. దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఆవిర్భవించి 17సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి నలమాటి లంకరాజు జెండాను ఆవిష్కరించి ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా లంకరాజు మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ పిలుపు మేరకు దివ్యాంగుల పించన్ల పెంపు డిమాండ్‌తో సెప్టెంబరు 9న చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి గత ఎన్నికల్లో దివ్యాంగుల పించన్లు పెంచుతామని ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో మట్టా శ్రీనివాసరావు, కొప్పాడ నాగరాజు, ఖండవల్లి ఏలియా, ముమ్మిడివరపు రాజేష్, సంసాని నాగరాజు, వీఎస్ గౌరీ, పల్లవి, గుత్తాల వెంకటరమణ, పెయ్యల బాలరాజు, బండారు నాగేశ్వరరావు, మట్టా సత్యనారాయణ, ఉందుర్తి ప్రకాష్, ఎస్.శ్రీను పాల్గొన్నారు.

విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా నిరసన


అమలాపురంలో వామపక్షాల జిల్లా నాయకుల నిరసన

అమలాపురం టౌన్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా వామపక్షాల ఆధ్వర్యంలో గురువారం అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో ప్రతిజ్ఞ దినం నిర్వహించారు. విద్యుత్ పోరాటంలో 2000లో అమరులైన బషీర్‌బాగ్ వీరులకు తొలుత ఘనంగా నివాళులర్పించారు. అమరవీరులను స్మరించుకుంటూ విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి దేవరాజేంద్రప్రసాద్‌లు మాట్లాడుతూ బషీర్‌బాగ్ సంఘటన జరిగిన 25ఏళ్లు పూర్తయిందన్నారు. స్మార్ట్‌మీటర్లను ప్రతీ ఇంటికీ బిగించాలని కూటమి ప్రభుత్వం చూస్తుందని ధ్వజమెత్తారు. స్మార్ట్ మీటర్లతో మోయలేని భారం సామాన్యులపై పడుతుందన్నారు. నిరసనలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు గుడే దుర్గాప్రసాద్, బుంగ సత్యనారాయణ, పాము బాలయ్య, రాణి, ముంగండ దుర్గాభాయి, పెయ్యల దుర్గాప్రసాద్, సీపీఐ జిల్లా కార్యకర్తలు, చెల్లుబోయిన తాతారావు, పుల్లెల ఆనంద్, సరెళ్ల శివ, గూడాల వెంకటరమణ పాల్గొన్నారు.

ఒలింపిక్ పతకాల ఆవిష్కరణ


ఒలింపిక్ పతకాలను ఆవిష్కరిస్తున్న జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు శరత్‌బాబు తదితరులు


అమలాపురం టౌన్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలానికి మూడు చొప్పున 66పాఠశాలలను జిల్లాలో ఎంపికచేసి వాలీబాల్ క్రీడా పోటీలు నిర్వహించినట్టు జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి పప్పుల శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. జిల్లాస్థాయి విజేతలతో పాటు మండలస్థాయిలో విజేతలకు ఒలింపిక్స్ మెడల్స్, సర్టిఫికెట్లు అందజేయనున్నట్టు వివరించారు. కిమ్స్ ఆసుపత్రి ఛైర్మన్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు), మేనేజింగ్ డైరెక్టర్ కె.రవికిరణ్‌వర్మల సౌజన్యంతో ఈపోటీలను నిర్వహించినట్టు ఒలింపిక్ అసోసియేషన్ జిల్లాశాఖ అధ్యక్షుడు అల్లాడ శరత్‌బాబు తెలిపారు. జిల్లా స్థాయిలో విజేతలైన 2వేల మంది విద్యార్థులకు ఒలింపిక్ పతకాలు, సర్టిఫికెట్లను అందజేస్తామన్నారు. శరత్‌బాబు అధ్యక్షతన గురువారం జరిగిన కార్యక్రమంలో ఒలింపిక్ పతకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కల్వకొలను బాబు, ఎస్వీ నాయుడు, గొలకోటి నారాయణరావు, యెరుబండి చంటి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్‌లో గోల్డ్‌మెడల్
అమలాపురం రూరల్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతి చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో జోనల్ స్థాయి నుంచి ఎంపికైన క్రీడాకారులతో రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు రెండు రోజులు తిరుపతిలో నిర్వహించారు. ఈ పోటీల్లో కోనసీమకు చెందిన యువ జంట బొంతు ఆదిత్యరామ్‌ప్రసాద్ (అమలాపురం), యాండ్ర గౌతమ్‌కుమార్ (మలికిపురం) రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తాచాటి పశ్చిమగోదావరి జిల్లా జట్టుపై విజయం సాధించి గోల్డ్ మెడల్ సాధించారు. బ్యాడ్మింటన్ సింగిల్స్‌లో యాండ్ర నందకిశోర్ ఫైనల్స్‌లో విజయం సాధించి స్వర్ణ పతకం దక్కించుకున్నారు. ఈనెల29న వైజాగ్‌లో జరిగే క్రీడా దినోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నుంచి జిల్లాకు చెందిన క్రీడాకారులు స్వర్ణ పతకాలను అందుకోనున్నారు.


బొంతు ఆదిత్యరామ్‌ప్రసాద్, యాండ్ర గౌతమ్‌కుమార్

వినాయకచవితి ఉత్సవాలు ప్రారంభం

- గ్రామాల కూడళ్లలో పందిళ్ల ఏర్పాటు
- విద్యుద్దీపాలతో అలంకరణ
- గణనాథుల ప్రతిష్ఠ.. ప్రత్యేక పూజలు


అమలాపురం నారాయణపేటలో భారీ గణపతి, ముమ్మిడివరంలో గణపతి, అంతర్వేది వెంకటేశ్వరస్వామి గుడి వద్ద, ఐ.పోలవరం: మురమళ్ళ మాణిక్యాంబానగర్‌లో గణపతి

అమలాపురం రూరల్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): పల్లె, పట్టణమన్న బేధం లేకుండా వాడవాడలా వినాయకచవితి వేడుకలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లోని లక్ష్మీగణపతి ఆలయం వద్ద విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకునేందుకు ఉదయం నుంచి రాత్రి వరకు వందలాది మంది భక్తులు బారులు తీరారు. స్వామివారి అక్షింతల కోసం పోటీపడ్డారు. షరాబుల పందిరిని విద్యుత్ కాంతులతో ప్రత్యేకంగా అలంకరించారు. నారాయణపేటలో భారీ గణపతి విగ్రహాన్ని నిర్వాహకులు ఏర్పాటు చేశారు. కళాశాల రోడ్డులో త్రిముఖ గణపతి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. కామనగరువు లక్ష్మీగణపతి ఆలయ ప్రాంగణమంతా పాలవెల్లిగా మార్చేశారు. వివిధ రకాల పండ్లతో ప్రత్యేకంగా అలంకరించారు. ర్యాలంగి కుమార్ శంకర్‌గౌడ్ ఆధ్వర్యంలోలక్ష్మీగణపతికి పంచదళ, షట్‌దళ బిల్వపత్రాలతో పూజలు నిర్వహించారు.

స్వాతంత్రోద్యమ స్ఫూర్తితో..

స్వాతంత్రోద్యమ కాలంలో ప్రతీ ఒక్కరిలో దేశభక్తిని పెంపొందించేందుకు కోలాటాన్ని ప్రత్యేక ఆయుధంగా ఎంచుకుని జనాలను సమీకరించి ప్రదర్శనలు నిర్వహించారు. అలాగే ఈదరపల్లి రామాలయం సెంటర్‌లో ఆదిగురువు అర్జునరావు ఆధ్వర్యంలో తాతముత్తాతల కాలం నుంచి వస్తున్న కోలాటం ప్రదర్శనను నేటి తరం కొనసాగిస్తూనే ఉంది. ఎస్సీ సామాజికవర్గానికి చెందిన యువకులు ఈదరపల్లిలోని రామాలయం వద్ద నుంచి కోలాటం ప్రదర్శన ప్రారంభించారు. ప్రతీ ఏటా చవితి రోజున కోలాటం ప్రదర్శనను కొనసాగిస్తున్నామని మాజీ సర్పంచ్ నక్కా సంపత్‌కుమార్ తెలిపారు. స్వాతంత్రోద్యమ స్ఫూర్తితో ప్రారంభమైన కోలాటం ప్రదర్శనను భవిష్యత్తు తరాలు కొనసాగించే విధంగా సాయిబాబా గురువు ఆధ్వర్యంలో ఏటా శిక్షణ ఇప్పిస్తున్నామన్నారు. ఈదరపల్లి నుంచి గడియార స్తంభం సెంటర్‌లోని లక్ష్మీగణపతి ఆలయం వద్ద వరకు కోలాటం ప్రదర్శన నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పట్టణ సీఐ పి.వీరబాబు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గూటం ఉదయ్‌కుమార్, బూల విజయ్, కడిమి బ్రహ్మాజీ, బొంతు నాగయ్య, బొంతు బుద్దేశ్వరరావు, బొంతు పండు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం, (ఆంధ్రజ్యోతి): గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని పలు గ్రామాల్లో గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని పెద్దపెద్ద పందిళ్లు వేసి విద్యుద్దీపాలతో అలంకరించారు. మండపాలను ఏర్పాటుచేసి ఉత్సవ విగ్రహాలు నెలకొల్పారు. ఉత్సవ కమిటీవారు ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు, గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ముమ్మిడివరం హైస్కూలు సెంటర్‌లోని లక్ష్మీగణపతి, బళ్లగేటు సెంటర్‌లో త్రిముఖ గణపతి, సుంకరవారి వీధిలో విజయగణపతి, పోలీసుస్టేషన్ సెంటర్‌లో లక్ష్మీగణపతి, మార్కెట్ ప్రాంతం, పెద్దవంతెన, రాయుడువారిపాలెం, అనాతవరం, మహిపాల చెరువు, గాడిలంక, అయినాపురం, కొత్తలంక, క్రాపచింతలపూడి గ్రామాల్లో గణపతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు.

పి.గన్నవరం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లో పందిళ్లు ఏర్పాటుచేసి గణనాథులను నెలకొల్పి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాగుల్లంక శివారు చాకలిపాలెంలో న్యాయవాది మొల్లేటి శ్రీనివాసరావు తన నివాస ఆవరణలో ప్రధాన రహదారి చెంతనే ప్రత్యేకంగా అలంకరించిన మండపంలో ఉయ్యాల్లో బొజ్జగణపయ్యను ప్రతిష్ఠించి చిన్న చిన్న గణనాథుని ప్రతిమలను ఏర్పాటు చేసి కుంటుంబ సభ్యులతో కలిసి పూజలు చేశారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపం విశేషంగా ఆకట్టుకుంది. వాహనదారులు ఫొటోలు తీసుకునేందుకు ఆసక్తి చూపారు. నాగుల్లంక వినాయకుని ఆలయంలో స్థానికుడు భీమాల శ్రీధర్ దంపతులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పి.గన్నవరంలో శ్రీసిద్ధివినాయక ఆటో యూనియన్, ఏటిగట్టు సెంటర్ ఆటోయూనియన్ సభ్యులు ప్రత్యేక మండపాల్లో గణనాథులను నెలకొల్పి పూజలు నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో గణపతి ఆలయాల్లో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మలికిపురం, (ఆంధ్రజ్యోతి): మలికిపురం మండలంలో వాడవాడలా వినాయచవితి వేడుకలు ఘనంగా జరిపారు. ప్రతీ వీధిలో పందిళ్ల ఏర్పాటుచేసి విద్యుత్ దీపాలతో మండపాలను తీర్చిదిద్ది వినాయకుని విగ్రహాలను నెలకొల్పి వైభవంగా చవితి వేడుకలు నిర్వహించారు. పలుచోట్ల చవితిని పురస్కరించుకుని యువకులు పందాలు నిర్వహించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా విద్యుత్‌శాఖాధికారులు నిర్వాహకులను అప్రమత్తం చేశారు.

అంతర్వేది, (ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి, సఖినేటిపల్లిలంక, రామేశ్వరం,అంతర్వేది దేవస్థానం, అంతర్వేది వేంకటేశ్వరస్వామి ఆలయం, కేశవదాసుపాలెం, మోరి, మోరిపోడు, వీవీ మెరక, టేకిశెట్టిపాలెం గ్రామాల్లో ఏర్పాటుచేసిన గణపతి మండపాల్లో వినాయక విగ్రహాలు ఏర్పాటుచేసి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. బుధవారం ఏకధాటిగా కురిసిన వర్షాన్ని సైతం లెక్కచేయకుండా భక్తులు వ్రతకల్ప పూజలో పాల్గొన్నారు. గణపతి మండపాల వద్ద ఆయా కమిటీల ఆధ్వర్యంలో భజనా కాలక్షేపాలు నిర్వహించారు.

అల్లవరం, (ఆంధ్రజ్యోతి): గణపతి నవరాత్రుల సందర్భంగా అల్లవరం మండలంలోని పలు గ్రామాల్లో గల వినాయకుని ఆలయాలు గణపతి పందిళ్ల వద్ద కుంకుమ పూజలు ఘనంగా జరుగుతున్నాయి. మొగళ్లమూరిలో క్షత్రియ పరిషత్ ఆధ్వర్యంలో గురువారం భారీ అన్నసమారాధన జరిగింది. మొగళ్లమూరి, అల్లవరం, బెండమూర్లంక, కొమరగిరిపట్నం, బోడసకుర్రు, దేవగుప్తం, డి.రావులపాలెం, ఓడలరేవు, గోడితిప్ప పరిసర గ్రామాల్లో నవరాత్రులను పురస్కరించుకుని గణపతి పందిళ్ల వద్ద నిత్య కుంకుమ పూజలు జరుగుతున్నాయి. గణపతి పందిర్లలో భక్తులు గణపతి లడ్డూలు ఏర్పాటు చేశారు.

ఐ.పోలవరం, (ఆంధ్రజ్యోతి): వాడవాడలా గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. గణనాథుని మండపాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. పలు ఆలయాల వద్ద భజనలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. వినాయక చవితి పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.

అంబాజీపేట, (ఆంధ్రజ్యోతి): అంబాజీపేట శివారు గంగలకుర్రు మలుపులో వేంచేసియున్న శ్రీయువగణపతి ఆలయాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో 108అరటి గెలలతో సర్వాంగసుందరంగా అలంకరించారు. వినాయకచవితి సందర్భంగా మండలంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాడవాడలా నవరాత్రుల పందిర్లను ఏర్పాటు చేసి గణపతి విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మండపాలను విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. యువకుల ఆధ్వర్యంలో ఆయా మందిరాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

మామిడికుదురు, (ఆంధ్రజ్యోతి): గణపతి నవరాత్రి ఉత్సవాలు మండలంలో బుధవారం ఘనంగా ప్రారంభించారు. వినాయచవితి పర్వదినాన్ని భక్తులు బుధవారం భక్తిశ్రద్ధలతో ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. మామిడికుదురు హైస్కూలు రోడ్డులో గల లక్ష్మీగణపతి ఆలయంలో ఆలయ నిర్మాత వాసంశెట్టి సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. లక్ష్మీగణపతి విగ్రహం వద్ద 50కిలోల లడ్డూను ఉంచారు. 31వ తేదీ ఆదివారం జరిగే అన్నసమారాధనలో భక్తులు ప్రసాదంగా పంపిణీ చేయనున్నట్టు ఆయన తెలిపారు. మామిడికుదురు గాంధీబొమ్మ వద్ద నగరం, అప్పనపల్లి, పాశర్లపూడి తదితర గ్రామాల్లో ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆయాచోట్ల పలు పూజా కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

ఉప్పలగుప్తం, (ఆంధ్రజ్యోతి): వినాయక చతుర్థి వేడుకలు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. గ్రామాల్లోని ఆలయాల వద్ద ప్రత్యేక వేదికలు ఏర్పాటు చేశారు. ప్రత్యేక మండపాలు ఏర్పాటుచేసి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించారు. వాడపర్రులో లక్ష్మీగణపతి, కూనవరంలో కర్షకగణపతి, గొల్లవిల్లిలో సిద్ధివినాయకుడు, భీమనపల్లి, చల్లపల్లి, చినగాడవిల్లి, సన్నవిల్లి, ఉప్పలగుప్తం, విలసవిల్లి, సూదాపాలెం, ఎస్.యానాం, గోపవరం తదితర గ్రామాల్లో గణపతి నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.

యానాం, (ఆంధ్రజ్యోతి): యానాంలో వినాయక చవితి ఉత్సవాలు వాడవాడాల ఘనంగా నిర్వహించారు. స్థానిక పిల్లారాయవీధిలోని లక్ష్మీగణపతి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి విశేషపూజలు నిర్వహించారు. ఆలయంలో స్వామివార్ని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీప్రతినిధి మల్లాడి కృష్ణారావు, ఉదయలక్ష్మీ దంపతులు, స్థానిక ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ దర్శించుకుని పూజలు నిర్వహించారు. యానాం నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాల్లో చవితి పందిళ్లు వేసి గణనాథులను ప్రతిష్ఠించి విశేష పూజలు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.




మామిడికుదురులో లక్ష్మీగణపతి, అయినవిల్లిలో ఎమ్మెల్యే గిడ్డి పూజలు, పి.గన్నవరం చాకలిపాలెంలో గణపతి

బకాయి వసూళ్ల నిర్లక్ష్యంపై కౌన్సిల్ సభ్యుల ధ్వజం

- చెత్త సేకరించే ట్రాక్టర్లే చెత్తగా మారిపోయాయి
- వాడీవేడిగా అమలాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం


మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురం టౌన్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ఏటా రూ.కోటి పైబడి ఆదాయం ఇస్తున్న సర్క్యులర్ బజార్‌లో కనీసం టాయిలెట్ల సదుపాయం కల్పించకపోతే ఎలా.. చెత్తను సేకరించే ట్రాక్టర్లే చెత్తగా మారిపోతున్నా పట్టించుకోరా. లక్షలాది రూపాయల బకాయిలు ఉన్నా రెవెన్యూశాఖ వసూళ్ల చేయడంలో ఎందుకు అలసత్వం వహిస్తుంది. పన్నులతో ఆదాయాన్ని సమకూర్చుకోవాలని ఇచ్చిన జీవోను ఎంతవరకు అమలు చేశారని అధికార విపక్ష కౌన్సిలర్లు మున్సిపల్ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అమలాపురం పట్టణాభివృద్ధికి ప్రధానంగా రూ.100కోట్లతో రోడ్ల అభివృద్ధికి ప్రతిపాదనలు రూపొందించినట్టు ఎమ్మెల్యే ఆనందరావు పేర్కొన్నారు. అమలాపురం పట్టణంలోని ప్రధాన సమస్యలపై కౌన్సిల్ సమావేశం గురువారం ఛైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి అధ్యక్షతన వాడీవేడిగా జరిగింది. తొలుత శ్మశాన వాటిక వద్ద కుక్కల బర్త్ కంట్రోల్ ఆపరేషన్ కోసం నిర్మించిన కట్టడంపై టీడీపీ కౌన్సిలర్లు బొర్రా వెంకటేశ్వరరావు, అబ్బిరెడ్డి చంటిలు ప్రశ్నించారు. ఈఅంశాన్ని కౌన్సిల్‌కు ఇంతవరకు ఎందుకు తీసుకురాలేదని ప్రశ్నించారు. అమలాపురం సర్క్యులర్ బజార్‌లో గేట్లు కూడా పనిచేయడం లేదని కౌన్సిలర్ గొవ్వాల రాజేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కమిషనర్ వి.నిర్మల్‌కుమార్ కలగజేసుకుని సర్క్యులర్ బజార్ మరమ్మతులు, రంగులు వేయడంతో పాటు టాయిలెట్ల నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందిస్తున్నట్టు వివరించారు. పురపాలక సంఘానికి మూడు నెలలు పైబడి, రూ.లక్ష పైబడి బకాయిలు ఉన్న వారి వివరాలను వెల్లడించాలని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు అధికారులను ప్రశ్నించారు. కమిషనర్ మాట్లాడుతూ 44మంది పన్ను బకాయిదారులను డిఫాల్టర్లగా గుర్తించామన్నారు. 2025-26 సంవత్సరానికి రూ.2.16కోట్లు పన్నులు పెంచి వసూలుచేసే విధంగా డిమాండ్ నోటీసులు అందించామన్నారు. స్పెషల్ డ్రైవ్ నిర్వహించి పన్నులు వసూలు చేస్తున్నామని వివరించారు. ఇప్పటివరకు రూ.41.92లక్షల పన్నులు వసూలు చేశామన్నారు. కౌన్సిలర్ దొమ్మేటి రాము మాట్లాడుతూ ఐదేళ్లకు పైబడి పురపాలక సంఘంలో స్క్రాప్ పేరుకుపోయినా ఇంతవరకు ఎందుకు వేలం నిర్వహించలేదని ప్రశ్నించారు. కౌన్సిలర్ మట్టపర్తి నాగేంద్ర మాట్లాడుతూ 8నెలలు గడిచిపోయినా రూ.36లక్షల బకాయిలు ఎందుకు ఉన్నాయని రెవెన్యూ సిబ్బందిని ప్రశ్నించారు. అసలు రెవెన్యూ సిబ్బంది పనిచేస్తున్నారా అని నిలదీశారు. అమలాపురం జిల్లాపరిషత్ బాలుర, బాలికోన్నత పాఠశాలలో ప్రాంగణాన్ని ఆనుకుని జాతీయ రహదారి చెంతన ఉన్న షాపుల నుంచి పన్నులు వసూలు చేస్తున్నారని ప్రతిపక్ష నేత యేడిద శ్రీను ప్రశ్నించారు. తొలుత 2006నుంచి పన్నులు వేస్తున్నట్టు కమిషనర్ తెలిపారు. వెంటనే ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ కలగజేసుకుని ఈవ్యవహారమంతా కోర్టు పరిధిలో ఉందన్నారు. ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు మాట్లాడుతూ ఇటీవల జిల్లాపరిషత్ ఛైర్మన్‌ను కలుసుకుని జిల్లాపరిషత్‌కు సంబంధించిన ఆస్తులన్నీ ప్రధాన రహదారుల పక్కన ఉన్నందున షాపింగ్ కాంప్లెక్సులు నిర్మిస్తే మంచి ఆదాయం వస్తుందని సూచించినట్టు తెలిపారు. చెత్త ట్రాక్టర్లు చెత్తగా మారిపోయాయని, కనీస మెయింటెన్స్ లేకపోవడం వల్ల సేకరించిన చెత్త అంతా మళ్లీ రోడ్డు మీదే పడిపోతుందని, ఆయా ట్రాక్టర్ల నుంచి పొగ వస్తున్నా పట్టించుకోవడంలేదని, ఎప్పటికప్పుడు ఫొటోలు తీసి అధికారులకు పంపిస్తున్నా చర్యలు లేవని కౌన్సిలర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

రూ.100 కోట్లతో రోడ్ల అభివృద్ధికి ప్రతిపాదనలు..

అమలాపురం పట్టణాభివృద్ధిలో అత్యంత కీలకమైన రోడ్ల అభివృద్ధికి రూ.100కోట్లతో ప్రతిపాదనలు రూపొందించినట్టు ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పేర్కొన్నారు. ఇతర మార్గాల ద్వారా నిధులు సమీకరించి పనులు చేపట్టడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య దారుణంగా ఉందని, రోడ్లను 40అడుగుల వెడల్పుగా విస్తరించాల్సి ఉందన్నారు. పట్టణానికి డంపింగ్ యార్డు అధికారికంగా లేని విషయాన్ని మున్సిపల్‌శాఖ మంత్రి నారాయణ దృష్టికి తీసుకువెళ్లామన్నారు. రైల్వే రిజర్వేషన్ కౌంటర్‌పై స్పష్టత తీసుకోవాల్సి ఉందన్నారు. పేరూరులో నూతనంగా ఏర్పాటుచేసిన ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు దాతలైన దొమ్మేటి వెంకటరెడ్డి, దొమ్మేటి నర్సయ్యశెట్టి పేరు పెట్టాలని కౌన్సిలర్ సంసాని బులినాని ఎమ్మెల్యేను కోరారు. అప్పట్లో 60ఎకరాల భూమిని విద్యాభివృద్ధికి కేటాయించిన దాతల పేర్లు పెట్టేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానన్నారు. దాతలు ఇచ్చిన భూముల్లో వ్యవసాయ ఆధారిత కోర్సులను తీసుకువచ్చే అవకాశం ఉందని ఎమ్మెల్యే వివరించారు.

ర్యాగింగ్‌కు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి
ముమ్మిడివరం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): శంకరగుప్తం గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థి గుర్రం విన్సెంట్‌ప్రసాద్‌పై ర్యాగింగ్ పేరుతో పైశాచికత్వానికి పాల్పడినవారిపై చర్యలు తీసుకోవాలని ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ చెల్లి అశోక్ డిమాండ్ చేశారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా బాధ్యులను శిక్షించాలన్నారు.

విద్యార్థి ప్రసాద్‌కు పరామర్శ

అంతర్వేది, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ఇటీవల రాజమహేంద్రవరంలోని ఒక హాస్టల్‌లో సహచర విద్యార్థుల పైశాచికత్వానికి బలై రాజోలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న శంకరగుప్తం గ్రామానికి చెందిన విన్సెంట్‌ప్రసాద్‌ను ఎస్సీ, ఎస్టీ, డిస్ట్రిక్ట్ విజిలెన్స్ మోనటరింగ్ కమిటీ మెంబరు, జనసేన పార్టీ జాయింట్ సెక్రటరీ తాడి మోహన్‌కుమార్, కూటమి శ్రేణులతో కలిసి పరామర్శించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జనసేన పార్టీ సంయుక్త కార్యదర్శి గుబ్బల రవికిరణ్ పాల్గొన్నారు.

అనంతకుమారికి శుభాకాంక్షలు



రాజోలు, ఆగస్టు28(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సహకార ఆర్థిక కార్పొరేషన్ ఛైర్మన్ రెడ్డి అనంతకుమారి విజయవాడ కార్యాలయంలో బుధవారం ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా బాధ్యతలు చేపట్టిన రెడ్డి అనంతకుమారికి గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు ఛైర్మన్ గుబ్బల శ్రీనివాస్ పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువా కప్పి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతకుమారికి శుభాకాంక్షలు తెలిపిన వారిలో రాజోలు నియోజకవర్గ పోలింగ్ బూత్ కన్వీనర్, కోఆర్డినేటర్ చాగంటి స్వామి, మలికిపురం మండల టీడీపీ అధ్యక్షుడు అడబాల యుగంధర్, రాజోలు ఎంపీపీ కడలి శ్రీదుర్గ, మొల్లేటి శ్రీనివాస్, బోనం బాబు, చుట్టుగుళ్ల కిశోర్, కడలి మోహన్ తదితరులు ఉన్నారు.


నకిలీ వెబ్‌సైట్‌తో జనన, మరణ ధ్రువపత్రాలు జారీ
ఏళ్ల తరబడి స్కామ్ జరుగుతున్నా పట్టించుకోరా: బులినాని



అమలాపురం టౌన్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మీరు ఏ రాష్ట్రంలో ఉంటున్నా సరే.. అమలాపురంలో మీకు చిన్న లింకు ఉంటే చాలు మీరు కోరుకున్న విధంగా జననం, మరణ ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తారు. అమలాపురం పురపాలక సంఘంలో ఏళ్ల తరబడి స్కామ్‌జరుగుతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని అధికార వైసీపీ సభ్యుడు సంసాని వెంకటచంద్రశేఖర్ (బులినాని) ప్రశ్నించారు. క్యూఆర్ కోడ్‌తో సహా నకిలీ వెబ్‌సైట్‌ను సృష్టించి నకిలీ జనన, మరణ ధ్రువపత్రాలు జారీ చేస్తున్నారని ఇటీవల జారీ అయిన జనన ధ్రువీకరణ పత్రాన్ని కౌన్సిల్ సమావేశంలో గురువారం అధికారులు, కౌన్సిల్ సభ్యులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యే సమక్షంలో సభ ముందు ఉంచారు. ఇటీవల హైదరాబాద్ హిమాయత్ నగర్‌లో స్థిరపడ్డ కొప్పినీడి వెంకటకుమార్ కుమారుడైన శ్రీరాజ్ పేరిట నకిలీ జనన ధ్రువీకరణ పత్రాన్ని పురపాలక సంఘం జారీ చేసిందని చూపించారు. మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్ స్పందిస్తూ ఇటీవల నకిలీ సర్టిఫికెట్లు జారీ వ్యవహారం తన దృష్టికి రాగానే అమలాపురం పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశానన్నారు. ప్రస్తుతం ఈవ్యవహారాన్ని సైబర్ క్రైమ్ పోలీసులు విచారిస్తున్నారని వివరించారు.

కాంప్లెక్స్ ఎరువుల వాడకం తగ్గించాలి
పి.గన్నవరం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): వరి చేలకు ప్రతి రైతు ఎరువులు, పురుగు మందు పిచికారీలో యజమాన్య పద్ధతులు పాటించాలని జిల్లా ఎరువాక కేంద్రం శాస్త్రవేత్త నందకిషోర్ తెలిపారు. పోతవరం పంచాయతీ కార్యాలయం వద్ద వరి రైతులతో ఖరీఫ్ యజమాన్య పద్ధతులపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతులు కాంప్లెక్స్ ఎరువుల వాడకాన్ని తగ్గించాలన్నారు. యూరియాను ఎకరాకు 50కిలోలు మూడు దఫాలుగా (పదిరోజుల తరువాత, పిలకలదశలో, చిరుపొట్టదశలో) వాడాలన్నారు. ఇన్‌చార్జ్‌ఏడీఏ సీహెచ్‌డీ విజయకుమార్, డీఆర్‌సీ ఏవో మనోహర్, సర్పంచ్ వడలి కొండయ్య, సాగునీటి డిస్ట్రిబ్యూటరి కమిటీ ఉపాధ్యక్షుడు చొల్లంగి సత్యనారాయణ మూర్తి, నీటి సంఘం అధ్యక్షుడు కె.సత్యనారాయణరాజు, ముంగండ సొసైటీ అధ్యక్షుడు మట్టపర్తి వెంకటేశ్వరరావు, రైతులు శ్రీను, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌ఏగా ఐఏఎస్ అధికారి అంకిత్‌కుమార్



యానాం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): యానాం పరిపాలనాధికారిగా 2023బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి అంకిత్ కుమార్‌ను నియమిస్తూ పుదుచ్చేరి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ శరత్ చౌహాన్ ఆదేశాలు జారీ చేశారు. ఢిల్లీకి చెందిన అంకిత్‌కుమార్ ఇటీవల పుదుచ్చేరికి ట్రైనింగ్ కోసం వచ్చారు. రెండేళ్ల ట్రైనింగ్ తర్వాత తొలి పోస్టింగ్ యానాం ఆర్‌ఏగా నియమించారు. ప్రస్తుతం పరిపాలనాధికారిగా పని చేస్తున్న ఆర్.మునిస్వామిని పుదుచ్చేరి సమాచారశాఖ డైరెక్టర్‌గా నియమించారు.

అకాల వర్షంతో ముంపు
అంతర్వేది, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలంలో మూడు రోజులుగా కురిసిన ఎడతెరిపి లేని వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. సార్వాసాగు ఊడ్చకుండా ఖాళీగా ఉన్న వరిచేలు చెరువులను తలపిస్తున్నాయి. కాలనీలు, లోతట్టు ప్రాంతాలు జలమయమై మండలంలో పలు గ్రామాలు ముంపునకు గురయ్యాయి. తీర ప్రాంత గ్రామాల్లో పాఠశాలలు, మోరి ప్రధాన రహదారి, అంతర్వేది దండుపుంత రోడ్డు నీట మునిగాయి. సఖినేటిపల్లిలో తాత్కాలిక భవనంతో ఉన్న ప్రాథమిక ఆర్యో కేంద్రం చుట్టూ వర్షం నీరుచేరింది. ప్రధాన మండల కార్యాలయాలు ఉన్న ప్రదేశం కూడా వర్షం నీరు చేరింది.

అనంగేశ్వరస్వామి ట్రస్టు బోర్డు ప్రమాణ స్వీకారం
ఉప్పలగుప్తం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): భీమనపల్లి శ్రీఅనంగేశ్వరాస్వామి ఆలయ నూతన ట్రస్టుబోర్డు ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమం గురువారం జరిగింది.ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ట్రస్టుబోర్డు ఛైర్మన్‌గా నూదా రామకోటేశ్వరరావు, సభ్యులుగా పొన్నపల్లి సత్యనారాయణశర్మ, వాసంశెట్టి వెంకటరమణ, కుండలేశ్వరపు లక్ష్మి, పాటి దుర్గాభవాని, దేశంశెట్టి వీరవెంకటదుర్గమణికంఠ, గొల్లపల్లి దుర్గాదేవి, మట్టపర్తి అరుణ, ఉద్దిశ వెంకటేశ్వరి, ఎక్స్‌అఫీషియో సభ్యునిగా వెలవలపల్లి సత్యనారాయణమూర్తి ప్రమాణస్వీకారం చేశారు. ఎంపీటీసీ దేశంశెట్టి నాగరత్నకుమారి, సొసైటీ ఛైర్మన్ ఆకేటి పెద్ద, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కంకటాల రామం, కూటమి నాయకులు దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, మెట్ల రమణబాబు, అరిగెల నానాజీ, అడపా అవినాష్, గుత్తుల నాగేశ్వరరావు, గుర్లింక చిన్నా, గొలకోటి తాతాజీ, మట్టపర్తి ధనరాజు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా పవన్‌కుమార్



అమలాపురం టౌన్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా అమలాపురం పట్టణానికి చెందిన కిసాన్‌మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లా పవన్‌కుమార్‌ను నియమించారు. గురువారం పార్టీ అధిష్ఠానం పవన్‌కుమార్‌తో పాటు జిల్లాల వారీగా అధికార ప్రతినిధులను నియమిస్తూ నియామక ఉత్తర్వులు గురువారం అందజేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ సారథ్యంలో పార్టీ అభివృద్ధికి క్షేత్ర స్థాయి నుంచి పనిచేస్తానని పవన్‌కుమార్ తెలిపారు. ఈసందర్భంగా జాతీయ కౌన్సిల్ సభ్యుడు మానేపల్లి అయ్యాజీవేమా, జిల్లాశాఖ అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, లంక దినకరణ్ తదితరులు అభినందనలు తెలిపారు.

తాతారావుకు అవార్డు



మామిడికుదురు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): నగరం గ్రామానికి చెందిన అంబేడ్కర్ వాది జాలెం తాతారావు భీమ్ రత్న అవార్డుకు ఎంపికయ్యాడు. ఈ అవార్డును ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దళిత చైతన్యవేదిక ఈనెల29న అందివ్వనున్నట్టు తాతారావు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈమేరకు దళిత చైతన్యవేదిక నుంచి పత్రం తాతారావుకు అందింది. డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ మహానాయకుడిని కలిసి కరచాలనం చేయడం, ఆయన అంత్యక్రియల్లో పాల్గొనడం పలు సామాజిక వివాహాలు చేయడం, స్వర్గీయ బీవీ రమణయ్య ఉద్యమ బాటలో నడవడం తదితర విషయాలను పరిగణనలోనికి తీసుకుని ఈ అవార్డుకు ఎంపిక చేసినట్టు దళిత చైతన్యవేదిక సభ్యులు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం
ఉప్పలగుప్తం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ఉప్పలగుప్తం సబ్‌స్టేషన్ పరిధిలో 11కేవీ భీమనపల్లి ఫీడర్ నిర్వహణ పనుల నిమిత్తం ఈనెల29న 9నుంచి 3గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్టు అమలాపురంట్రాన్స్‌కో ఈఈ కె.రాంబాబు తెలిపారు. గొల్లవిల్లి, సూదాపాలెం, భట్టుపాలెం, సింగరాయపాలెం, నంగవరం, భీమనపల్లి, విలసవిల్లి గ్రామాలకు సరఫరా ఉండదన్నారు.

గిడుగుకి చిత్రనివాళి



అమలాపురం రూరల్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): శుక్రవారం తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని పాలగుమ్మి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల పార్టుటైమ్ ఇనస్ట్రక్టర్, ఆర్ట్ ఎడ్యుకేషన్‌గా పనిచేస్తున్న పోలిశెట్టి చంద్రకుమార్ తెలుగుతల్లి, గిడుగు వెంకటరామమూర్తి చిత్రాలను వాటర్ కలర్స్‌తో గీశారు. ఆధునిక తెలుగు సాహిత్యానికి ప్రాణం పోసిన వెంకటరామమూర్తికి ఆయన చిత్రనివాళి అందించారు. మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని ఏటా ఆగస్టు 29న జాతీయ క్రీడా దినోత్సవం జరుపుకుంటున్నాం. దీనిలో భాగంగా మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటాన్ని వాటర్ కలర్స్‌తో గీసి చంద్రకుమార్ అందరినీ ఆకట్టుకున్నారు.

తెలుగువారి ఆత్మగౌరవాన్ని చాటిన మహనీయుడు ఎన్టీఆర్



వల్లూరులో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణలో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

కపిలేశ్వరపురం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): తెలుగువారి ఆత్మగౌరవాన్ని నలుదిశలా చాటిచెప్పిన మహనీయుడు ఎన్టీఆర్ అని రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. బుధవారం వల్లూరులో టీడీపీ యువనేత వల్లూరి సాయికుమార్‌బాబుతో పునర్నిర్మించిన ఎన్‌టీఆర్ విగ్రహ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు, రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ వేగుళ్ళ లీలాకృష్ణలతో కలిసి ఆయన ప్రారంభించారు. పార్టీ పతాకాన్ని వారు ఆవిష్కరించారు. ఎన్టీఆర్ విగ్రహాన్ని ప్రారంభించడం తన అదృష్టంగా భావిస్తున్నానని మంత్రి అన్నారు. ఎమ్మెల్యే జోగేశ్వరరావు, చైర్మన్ లీలాకృష్ణ మాట్లాడుతూ గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని తిరిగి ఇక్కడ ఏర్పాటు చేసి మంత్రి చేతుల మీదుగా ఆవిష్కరించడం తమ అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. అనంతరం గ్రామంలోని చెరువు గట్టు ఆక్రమణలో తొలగించిన 9 మంది గృహాల వాసులకు ఇళ్ల పట్టాలను సర్పంచ్ డి.మీనాకుమారి చేతులమీదుగా అందజేశారు. గ్రామంలోని వివిధ ప్రదేశాలలో ఎంజీఎఆర్‌ఈజీఎస్ నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను, హౌసింగ్ కాలనీలో జేజేఎం నిధులతో నిర్మించిన ఓహెచ్ఎస్ఆర్, ఇంటింటికి మంచినీటి కుళాయి పథకాన్ని మంత్రి సుభాష్, ఎమ్మెల్యే వేగుళ్ళ, చైర్మన్ లీలాకృష్ణలతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమాల్లో వల్లూరి సాయికుమార్, చుండ్రు వరప్రకాష్, నల్లమిల్లి వీర్రెడ్డి, చింతపల్లి రామకృష్ణ తదితరులతో పాటు పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు, గ్రామస్థులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తొలగించిన దివ్యాంగుల పింఛన్లను పునరుద్ధరించాలి



ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న దివ్యాంగులు

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): తొలగించిన దివ్యాంగుల పింఛన్లు పునరుద్ధరించాలని కోరుతూ గురువారం ఆర్డీవో కార్యాలయం వద్ద వారు ధర్నా చేశారు. దివ్యాంగుల హక్కుల వేదిక ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు పలివెల రాజు, జాతీయ అధ్యక్షుడు ముత్యాల పోసికుమార్, పీడీఎస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్దూ, బీసీపై పార్టీ బర్ల శ్రీనివాస్ యాదవ్ తదితరులు మాట్లాడుతూ పింఛన్ల రద్దుతో వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు రోడ్డునపడ్డారని అన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించకుండా తొలగించడం అన్యాయమన్నారు. తొలగించిన దివ్యాంగుల పింఛన్లను పునరుద్ధరించాలని డిమాండు చేశారు. డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఆర్డీవో దేవరకొండ అఖిలకు అందచేశారు. కార్యక్రమంలో దివ్యాంగుల హక్కుల వేదిక మహిళా నాయకురాలు సత్య, ఉమాదేవి, దుర్గాదేవి, నాగలక్ష్మీ, సత్తిబాబు, నూకరాజు, మల్లిఖార్జున్, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో ఆర్డీవో ఆకస్మిక తనిఖీలు



చొప్పెల్ల పీహెచ్‌సీలో ఆకస్మిక తనిఖీ చేస్తున్న ఆర్డీవో శ్రీకర్

ఆలమూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): చొప్పెల్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కొత్తపేట ఆర్డీవో శ్రీకర్ గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆసుపత్రి వైద్యాధికారి ఎన్.స్నేహలతను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆర్డీవో పీహెచ్‌సీలో ఓపీ వివరాలు, మందుల స్టాక్, ఇన్ పేషెంట్లు వివరాలతోపాటు అక్కడికి వచ్చిన రోగుల సేవలను గుర్తించి అడిగి తెలుసుకున్నారు. ఆర్డీవో వెంట ఆలమూరు ఎంపీడీవో ఎ.రాజు, డిప్యూటీ తహశీల్దార్ సుబ్బరాజు, పలు అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

జొన్నాడ వద్ద ఇసుక స్టాక్‌పాయింట్ పరిశీలిన: జొన్నాడ వద్ద ఏర్పాటు చేసిన ఇసుక స్టాక్ పాయింట్‌ను కొత్తపేట ఆర్డీవో శ్రీకర్ అధ్వర్యంలో అధికారుల బృందం పరిశీలించారు. స్టాక్ పాయింట్ వివరాలను స్థానిక రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇసుక నిల్వలు, తరలించే సమయంలో రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది వివరాలను అడిగి వారితో కొద్దిసేపు మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎ.రాజు, డీటీ సుబ్బరాజు, మండల పరిషత్ ఏవో మెహర్ ప్రకాష్, మండపేట రవాణాశాఖాధికారి శ్రీదేవి, పలువురు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు వృత్తి నైపుణ్య శిక్షణలు



మహిళలకు టూల్‌కిట్లు అందచేస్తున్న దృశ్యం

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించాలనే వృత్తి నైపుణ్య శిక్షలు ఇస్తున్నట్లు సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం అన్నారు. గురువారం రామచంద్రపురం జూనియర్ కళాశాలలో యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా, ఆర్‌ఎస్‌ఈటి సౌజన్యంతో మహిళలకు 14 రోజులపాటు ఇవ్వనున్న జూట్‌బ్యాగ్ తయారీ శిక్షణలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా లీడ్ బ్యాంకు మేనేజరు వర్మ, కాకినాడ జిల్లా ఎల్‌డిఎం ప్రసాద్, ఆర్ఎస్‌ఈటిఐ డైరెక్టరు శ్రీనివాస్, యుబీఐ బ్రాంచి మేనేజరు నందిని తదితరులు పాల్గొన్నారు. జ్యూట్ బ్యాగుల తయారీ శిక్షణకు వచ్చిన 35 మంది మహిళలకు వాసంశెట్టి సత్యం యూనిఫారం, టూల్‌కిట్లు అందచేశారు. కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

రైతులకు మెరుగైన సేవలందించాలి

మంత్రి సుభాష్

కపిలేశ్వరపురం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) :సహకార సంఘాల ద్వారా రైతులకు మెరుగైన సేవలందించి సొసైటీ అభివృద్ధికి కృషి చేయాలని మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. బుధవారం మండలంలోని వల్లూరు సహకార సొసైటీలో జరిగిన వ్యవసాయ సహకార సంఘం త్రిసభ్య కమిటీ సమావేశంలో మంత్రి సుభాష్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు, నీటి పారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ వేగుళ్ళ లీలాకృష్ణ పాల్గొన్నారు. అనంతరం సొసైటీ అధ్యక్షులుగా గుత్తుల శ్రీనివాస్, సభ్యులుగా చల్లా సూర్యనారాయణ, మాత వరప్రసాదబాబు, ప్రమాణ స్వీకారం చేశారు. కూటమి నాయకులు, రైతులు, గ్రామస్థులతో కలిసి వారు నూతన కమిటీని సన్మానించగా సొసైటీ ఆధ్వర్యంలో మంత్రి, ఎమ్మెల్యే, లీలాకృష్ణలను సన్మానించారు. కార్యక్రమంలో కూటమి నేతలు, వల్లూరి సాయికుమార్, చింతపల్లి రామకృష్ణ, సర్పంచ్ డి. మీనాకుమారి, వల్లూరి వీరబాబు, ముత్యాల శ్రీధర్, బలవరెడ్డి సత్తిబాబు, పుత్సల శ్రీనివాస్, గుడాల జయబాబు తదితరులతో పాటు సొసైటీ సీఈవో వి.వెంకట రామారావు, గ్రామప్రముఖులు, రైతులు, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.



పాణింగపల్లిలో వంతెనకు రక్షణ గోడలు లేక ప్రమాదంగా మారిన దృశ్యం

ప్రమాదాలు జరిగే వరకు పట్టించుకోరా?

పాణింగపల్లి వంతెనకు రక్షణగోడ లేక వాహనదారుల ఆందోళన

కె.గంగవరం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాణింగపల్లి - ద్రాక్షారామ రహదారిలో వంతెన రక్షణ గోడలు ధ్వంసమై ప్రమాదంగా మారింది. పాణింగపల్లి నుంచి ద్రాక్షారామ వెళ్లే దారిలో టేకి డ్రైన్‌పై ఉన్న వంతెన రక్షణ గోడలు రెండు వైపులా ధ్వంసమయ్యాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. వాహనాలు అదుపుతప్పితే కాలువలో పడిపోవాల్సిందేనని ఆందోళన చెందుతున్నారు ఈ రహదారిలో ప్రతిరోజూ అనేక మంది వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారని స్థానికులుంటున్నారు. వంతెన ప్రమాదంగా మారడంపై ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాపోతున్నారు. ఆర్‌అండ్‌బి అధికారులు ఇక్కడి సమస్యను గుర్తించి వంతెనకు రక్షణ గోడలు ఏర్పాటు చేయాలన్నారు. మున్ముందు ప్రమాదాలు జరగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

31న జాబ్‌మేళా

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం ఉపాధి కార్యాలయంలో 31న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు మంత్రి సుభాష్ కార్యాలయం తెలిపింది. ఆదివారం జరిగే ఈ జాబ్‌మేళాలో మదర్ సాన్, ముత్తూట్ ఫైనాన్స్, గూగుల్‌పే కంపెనీలు నియామకాలు చేపడతాయని నిరుద్యోగులు వినియోగించుకోవాలని కోరారు.

పార్వతి తనయా నమోస్తుతే

• భక్తిశ్రద్ధలతో చవితి వేడుకలు • ప్రారంభమైన గణపతి నవరాత్రులు • మండపాల వద్ద యువత జోష్



ఆత్రేయపురం మండలం వాడపల్లి విశ్వేశ్వరస్వామి ఆలయంలో వినాయకుడు

ఆలమూరు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో బుధవారం వినాయక చవితి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఆలమూరు లక్ష్మీగణపతి ఆలయం వద్ద మట్టిగణపయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఏడేళ్లుగా ఇక్కడ 10 నుంచి 16 అడుగుల ప్రతిమను ఏర్పాటు చేస్తున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ నార్కేడిమిల్లి వెంకన్నబాబు అధ్వర్యంలో ప్రతి సంవత్సరం దీన్ని చేయడానికి వేళ్లంగి గ్రామానికి చెందిన శిల్పి కోదండరామ్ 15 రోజుల ముందు నుంచి ఆయా పనులకు శ్రీకారం చుడతారు. ఈ సంవత్సరం 13 అడుగుల ఎత్తులో వరసిద్ధి వినాయక ఆకారంలో ప్రతిమను ఏర్పాటు చేశామని కమిటీ చైర్మన్ వెంకన్నబాబు తెలిపారు.

రామచంద్రపురం(ద్రాక్షారామ), (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం పట్టణం, మండలంలో బుధవారం వినాయక చవితి వేడుకలు జరిగాయి. పట్టణంలో దఫేదారు నూతి సెంటర్, లారీ యూనియన్ కార్యాలయం, టాక్సీ ఓనర్స్ అసోసియేషన్, బ్రాడీపేట, రత్నంపేట, వైఎస్ఆర్ నగర్‌లో గణపతి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభించారు. ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో దుండి గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలో యనమదల, నరసాపురపుపేట, తోటపేట, తాళ్లపొలం, ద్రాక్షారామ భీమేశ్వరాలయ బాహ్యప్రాంగణం, కంబాల చెరువు, బియ్యంపేట తదితర ప్రాంతాల్లో గణపతి విగ్రహాలను ఏర్పాటు చేసి చవితి వేడుకలు నిర్వహించారు.

కాపవరంలో శాశ్వత గణపతి మండపం

ద్రాక్షారామ, (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం కాపవరంలో బాలగణపతి నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు శాశ్వత మండపం నిర్మించారు. గ్రామానికి చెందిన సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో దీని నిర్మాణం చేశారు. దాతల సహకారంతో నిర్మాణం జరిపిన మండపంలో చవితి సందర్భంగా వినాయకుడు విగ్రహాన్ని ప్రతిష్ఠించి సర్పంచ్ యనమదల మంగాదేవి, ఎంపీటీసీ సభ్యుడు రెడ్నం సతీష్‌ల చేతుల మీదుగా ప్రారంభించారు. శాశ్వత మండపం నిర్మాణానికి సహకరించిన సామాని వీర దుర్గ ప్రసాద్, యనమదల శ్రీను తదితరులకు పలువురు కృతజ్ఞతలు తెలిపారు.



కొత్తపేటలో వినాయక చవితి పూజలో పాల్గొన్న చిన్నారులు

మండపాల వద్ద యువత జోష్

కె.గంగవరం, (ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం ఆయా గ్రామాల్లో వినాయక చవితి వేడుకలను ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో యువత వినాయక మండపాలు ఏర్పాటు చేశారు. వేకువజాము నుంచే భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.

రాయవరం, (ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం వినాయక చవితి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. వెదురుపాక విజయ దుర్గా పీఠంలో అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు అధ్వర్యంలో వినాయక చవితి వేడుకలు జరిపారు. పీఠాధిపతి గాడ్ భక్తులకు వినాయక చవితి కథ వివరించి అక్షింతలను అందజేశారు. మండలంలోని లొల్ల గ్రామంలో శివలింగంపై కొలువైన వినాయకుడి విగ్రహాన్ని ఏర్పాటు చేసి పూజలు చేశారు. సోమేశ్వరం గ్రామంలో వినాయకుడి భుజంపై ఒకప్రక్క శివుడు మరోవైపు అయోధ్య రామమందిరం బొమ్మలతో ఏర్పాటు చేసిన వినాయకుడు, వెదురుపాక సపటా సెంటర్‌లో లక్ష్మీగణపతి విగ్రహం భుజాలపై ఒక వైపు రాముడు, మరో వైపు శివుడు కొలువై ఉన్న వినాయకుడు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆయా గ్రామాల్లో వినాయక ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో గణపతి మండపాలను ఏర్పాటు చేశారు.



రావులపాలెం ఆదిలక్ష్మినగర్‌లో వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం


కపిలేశ్వరపురం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో బుధవారం వినాయక చవితిని ఘనంగా నిర్వహించారు. గణపతి నవరాత్రులల్లో భాగంగా ఆయా గ్రామాల్లోని కాలనీలు, ప్రధాన కూడళ్ళ వద్ద ఏర్పాటు చేసిన మండపాల వద్ద గణేష్ విగ్రహాలను నెలకొల్పి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆత్రేయపురం, (ఆంధ్రజ్యోతి): మండలం లోని ఆయా గ్రామాల్లో బుధవారం వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లోని ముఖ్య కూడళ్ల వద్ద వినాయకుడి విగ్రహాలను ఏర్పాటు చేసి పూజలు జరిపారు. ర్యాలి ఆర్యవైశ్య సంఘ కల్యాణ మండపంలో సుమారు రూ.2లక్షల కరెన్సీ నోట్లతో వినాయక మండపాన్ని అలంకరించి పూజలు జరిపారు. వాడపల్లి విశ్వేశ్వరస్వామి ఆలయంలోని వినాయకుడు, ఆత్రేయపురం లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో వినాయక మండపాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు జరిపారు.

కొత్తపేట, (ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం వినాయక చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కొత్తపేట సంత మార్కెట్ వినాయకుడు, కళానగర్ సిద్ధి వినాయకుడు, ఆర్యవైశ్య వరసిద్ధి వినాయకుడు, పాత రామాలయం, లక్ష్మీగణపతి ఆలయాల వద్ద గణపతి నవరాత్రి వేడుకలను ప్రారంభించారు.

నవరాత్రి ఉత్సవాలు

రావులపాలెం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా ప్రాంతాల్లో గణపతి నవరాత్రులు ఘనంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని ఆయా ముఖ్య కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన గణపతి మండపాలు, ఆలయాల వద్ద గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.



రామచంద్రపురం దఫేదార్ సెంటర్‌లో మట్టిగణపతి విగ్రహం



రాయవరం మండలం లొల్లలో శివలింగంపై కొలువైన గణపతి



కె.గంగవరం మండలం కూళ్ల గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయకుడు



మండపేటలో సీఎం సహాయనిధి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

సీఎం సహాయనిధి చెక్కుల అందజేత

మండపేట, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గానికి చెందిన 40 మంది అనారోగ్యంతో బాధపడుతూ పలు ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకున్న వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.18,40,380 చెక్కులను ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు గురువారం బాధిత కుటుంబాలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన కూటమి నాయకులు పాల్గొన్నారు. సీఎం సహాయ నిధిని మంజూరు చేసి అందజేసిన ఎమ్మెల్యే వేగుళ్లకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆలమూరు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ఆలమూరు సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని రామచంద్రపురం డీఈ రత్నాలరావు తెలిపారు. ఆలమూరు సబ్‌స్టేషన్ పరిధిలోని తాతపూడి, సూర్యారావుపేట, సందిపూడి, చింతలూరు, పెదపళ్ల, కొత్తూరు గ్రామాలలోని విద్యుత్ లైన్లు మరమ్మతులు నిమిత్తం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

సమగ్రశిక్ష సమావేశానికి ఉపాధ్యాయుడి ఎంపిక



రాయవరం, ఆగస్టు 28(ఆంధ్ర జ్యోతి): విజయవాడలో 30న నిర్వహించే ఉపాధ్యాయుల సమావేశానికి వి.సావరం యూపీ పాఠశాల గణిత ఉపాధ్యాయుడు పాలెపు నాగేశ్వరరావు ఎంపికయ్యారు. గురువారం వి.సావరంలో ఉపాధ్యాయుడు నాగేశ్వరరావు మాట్లాడుతూ పలు సామాజిక మాధ్యమాల ద్వారా గణితంపై విద్యార్థులకు ఉచితంగా ఆన్‌లైన్ పాఠాలు అందిస్తున్న ఉపాధ్యాయులతో సమగ్రశిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు సమావేశాన్ని ఏర్పాటు చేశారన్నారు. విద్యార్థులకు ఆసక్తికరంగా, సరళమైన విధానంలో వినూత్నంగా అందించే విధానంపై చర్చించేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేశారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ సమావేశానికి 41 మంది ఉపాధ్యాయులు ఎంపిక కాగా కోనసీమ జిల్లా నుంచి ముగ్గురు ఎంపిక కాగా తాను దీనికి హాజరుకానున్నట్లు చెప్పారు. సమావేశానికి హాజరవుతున్న ఆయన్ను పలువురు అభినందించారు.

తెలుగుభాషతో తెలుగుజాతి మనుగడ



సంధిపూడిలో తెలుగుభాషా దినోత్సవంలో కథల పుస్తకాలతో విద్యార్థులు

ఆలమూరు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): తెలుగు భాషతోనే తెలుగుజాతి మనుగడ వృద్ధి చెందుతుందని వక్తలన్నారు. సంధిపూడి జడ్పీహైస్కూల్‌లో గురువారం బాల మందిరం వ్యవస్థాపకులు కృష్ణశ్రీ ఆధ్వర్యంలో తెలుగుభాష దినోత్సవ సభను సర్పంచ్ తోట భవానీవెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించారు. సభలో తెలుగుభాష ప్రాముఖ్యతపై కవి కృష్ణశ్రీ, ఎంఈవో బి.అప్పాజీ, యువ రచయిత గొడవర్తి శ్రీనివాస్, టీడీపీ నాయకులు దొడ్డా సుబ్బారావు తదితరులు ప్రసంగించారు. ముందుగా గిడుగు రామ్మూర్తిపంతులు చిత్రపటానికి పలువురు నివాళులర్పించారు. యువ రచయిత గొడవర్తి శ్రీనివాస్ రచించిన ఆలమూర్లో కథలు పుస్తకాన్ని పలువురికి అందజేశారు.

అన్నదాన భవన నిర్మాణానికి విరాళం

ఆత్రేయపురం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్మిస్తున్న వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి వసంతవాడకు చెందిన ఎన్‌ఆర్‌ఐ కాకర్లపూడి అజయ్‌కుమార్, షర్మిల దంపతులు రూ.లక్ష విరాళం సమర్పించారు. దాతకు స్వామి వారి చిత్రపటం అందచేసి వేదాశీర్వచనం అందజేశారు. ఆలయంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు పరిశీలించారు. గురువారం సెల్‌ఫోన్లు, లగేజీ బ్యాగులకు సంబంధించిన టెండర్లు నిర్వహించగా సింగల్ టెండర్ రావడంతో ఈ ప్రక్రియను రద్దు చేసి సెప్టెంబరు 5న టెండరు తిరిగి నిర్వహిస్తామని ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.



వాడపల్లి వేంకటేశ్వరస్వామి అన్నదానానికి విరాళం అందిస్తున్న దృశ్యం

గిడుగుకు నివాళి

రాయవరం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): తెలుగుభాషా వికాసానికి పాటుపడిన గిడుగు వెంకట రామమూర్తి జయంతి పురస్కరించుకుని వెదురుపాక గ్రామానికి చెందిన తెలుగు ఉపాధ్యాయుడు చిర్రా వెంకటమోహన్ అక్షర వర్ణమాలతో గీచిన గిడుగు రామమూర్తి చిత్రపటం ఆకట్టుకుంది. గురువారం మాట్లాడుతూ తెలుగు భాషాపై ఉన్న అభిమానంతో తెలుగు వర్ణమాల, గుణింతాల అక్షరాలతో గిడుగు రామమూర్తి పంతులు చిత్రపటాన్ని గీచి ఆయనకు నివాళులర్పించినట్లు చెప్పారు.

పెరుగుతున్న గోదావరి వరద

ఆలమూరు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): గోదావరి ఎగువ ప్రాంతాలతోపాటు మూడు నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో గోదావరికి వరదనీటి ఉధృతి పెరిగింది. దీంతో ఆలమూరు మండలంలో లంక గ్రామాలలో వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తున్నది. జొన్నాడ వద్ద గోదావరి ఉధృతి పెరగడంతో రెండు బ్రిడ్జిల మధ్య వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తున్నది. లంక గ్రామాలైన బడుగువాని లంక, మడికి, చెముడులంక, చొప్పెల్ల, మూలస్థానం, జొన్నాడ, ఆలమూరు లంక భూములలో లోతట్టు ప్రాంతాలకు వరదనీరు మళ్లీ చేరుతోంది.



అభివృద్ధి పనులకు భూమిపూజ

కె.గంగవరం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దంగేరు గ్రామంలో అభివృద్ధి పనులకు ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్ గురువారం భూమి పూజ నిర్వహించారు. స్థానిక సుబ్రహ్మణ్యస్వామి ఆలయం వద్ద నుంచి ఎరకలరేవు వరకు బీటీ రోడ్డు, వాసాల రేవులో నిర్మించే రెండు సీసీరోడ్లకు ఎంపీ భూమిపూజ చేశారు. కార్యక్రమం లో ఎంపీపీ పంపన నాగమణి, వైస్ ఎంపీపీ నీతుపూడి మధు బాలకొండ, జడ్పీటీసీ ఓబులేని శ్రీవరలక్ష్మి, దంగేరు సర్పంచ్ కొప్పిశెట్టి వెంకటరమణ, ఎంపీటీసీ కొప్పిశెట్టి లక్ష్మణ్, వైస్ ప్రెసిడెంట్ దారా సత్యనారాయణ, పద్మావతి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ పంపు గోవిందరాజు, తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ఎంపీ బోస్

కూటమి, ప్రతిపక్ష, ప్రజా సంఘాల కృషి ప్రశంసనీయం

జేఏసీ అధ్యక్షుడు ప్రభాకరరావు

మండపేట, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మండపేట నియోజకవర్గాన్ని రాజమహేంద్రవరంలో కలిపే అంశంపై చేస్తున్న పోరాటానికి సహకరిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, కూటమి నేతలకు జేఏసీ కమిటీ చైర్మన్ కామన ప్రభాకరరావు కృతజ్ఞతలు తెలిపారు. గురువారం మండపేటలో విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం నియమించిన శాసనసభ కమిటీని నియమించిన తర్వాత ఎమ్మెల్యే వేగుళ్ళ, ఏపీఐడీసీ చైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణ సబ్‌కమిటీని కలిసి వారికి వినతిపత్రం అందజేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కోనసీమ నుంచి రాజమండ్రిలో కలిపే వరకు విశ్రమించేది లేదన్నారు.

తెలుగుతేజం పురస్కారానికి ఎంపిక



రాయవరం, ఆగస్టు 28 (ఆంధ్ర జ్యోతి): శ్రీశ్రీ కళావేదిక అందించే ప్రతిష్ఠాత్మకమైన తెలుగుతేజం పురస్కారానికి మండలంలోని వెదురుపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న సంపర వేణుగోపాల సింగుబాబు ఎంపికైనట్లు గురువారం తెలిపారు. వెదురుపాకలో ఆయన మాట్లాడుతూ పల్నాడు జిల్లా నరసరావుపేటలో కొత్త రఘురావయ్య కళాశాల ఆటిటోరియంలో ఈనెల 31న నిర్వహించే తెలుగు భాషా దినోత్సవ సంబరాల్లో తాను పురస్కారం స్వీకరించనున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో తెలుగు భాష, సాహిత్య, సంప్రదాయం, సంస్కృతుల పరిరక్షణ, ప్రాచుర్యంలో చేస్తున్న వారికి ఏటా పురస్కారాలు అందజేస్తుండగా తాను పురస్కారానికి ఎంపికైన ఆయన తెలిపారు. శ్రీశ్రీ కళావేదిక చైర్మన్ కె.ప్రతాప్ నుంచి ఆహ్వానం అందుకున్నానన్నారు. ఈ సందర్భంగా సింగుబాబును డీవైఈవో రామలక్ష్మణ మూర్తి, హెచ్‌ఎం రాంబాబు, ఎంఈవో2 వై.సూర్యనారాయణ, పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

మండపేట, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి) మండపేట మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం శుక్రవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి అధ్యక్షతన జరుగుతుందని మున్సిపల్ కమీషనర్ టీవీ రంగారావు తెలిపారు. ఈ సమావేశానికి కౌన్సిలర్‌లు విధిగా హాజరుకావాలని ఆయన కోరారు.

ర్యాగింగ్‌కు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి

ముమ్మిడివరం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): శంకరగుప్తం గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థి గుర్రం విన్సెంట్‌ప్రసాద్‌పై ర్యాగింగ్ పాల్పడినవారిపై చర్యలు తీసుకోవాలని ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ చెల్లి అశోక్ డిమాండ్ చేశారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా బాధ్యులను శిక్షించాలన్నారు.